


సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 214 పేజిలు : 12, వెల రూ. 5/- శనివారం, సెప్టెంబరు 26, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA



# వైభవంగా నిమజ్జనం

**ఆరు గంటల 20 నిమిషాల్లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం**

**ఉదయం 9.35 గంటలకు ప్రారంభమైన శోభాయాత్ర.. మధ్యాహ్నం 2.45కు సంపూర్ణం**

**పటిష్ఠ భద్రత, సమన్వయంతో ప్రశాంతంగా సాగిన మహా వేడుక**

**రాష్ట్రవ్యాప్తంగా 1.24 లక్షల విగ్రహాలు నమోదు.. 88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తి**

హైదరాబాద్, సెప్టెంబర్ 26: భక్తుల జయజయధ్వానాల మధ్య ఖైరతాబాద్ శ్రీ పంచముఖ సంకటహర మహాగణపతి నిమజ్జనం నిర్విఘ్నంగా పూర్తయింది. 69 అడుగుల ఎత్తులో కొలువుదీరి పదకొండు రోజుల పాటు విశేష పూజలందుకున్న మహాగణపతి శుక్రవారం హుస్సేన్‌సాగర్‌లో గంగమ్మ ఒడికి చేరాడు. ఉదయం 9.35 గంటలకు ప్రారంభమైన శోభాయాత్ర మధ్యాహ్నం 2.45 గంటలకు ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబరు 4 వద్ద నిమజ్జనంతో ముగిసింది. మొత్తం ఆరు గంటల 20 నిమిషాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది. గతేడాది మధ్యాహ్నం 1.45 గంటలకే నిమజ్జనం పూర్తికాగా.. ఈసారి సాంకేతిక కారణాలతో గంట ఆలస్యమైంది. గురువారం రాత్రి 8 గంటలకు కలశపూజ నిర్వహించి నిమజ్జన ఏర్పాట్లు ప్రారంభించారు. అర్ధరాత్రి తర్వాత మహాగణపతిని భారీ వాహనంపైకి తరలించే ప్రక్రియ చేపట్టారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు శోభాయాత్ర ప్రారంభం కావాల్సి ఉండగా.. విగ్రహాన్ని వాహనంపైకి ఎత్తేందుకు

(మిగతా 2వ పేజీలో)

# కేరళ రాజకీయ సునామీ.. దేశమంతా విస్తరించాలి

**రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడటమే మిగిలిన ఆకాంక్ష : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం చేయా**

**కేరళలో కాంగ్రెస్ గెలిస్తే.. ఢిల్లీలోనూ మార్పు వస్తుందన్న రేవంత్‌రెడ్డి**

**ఆర్యదాన్ ముహమ్మద్-2026 ఉత్తమ ప్రజాసేవకుడి అవార్డు స్వీకరణ**



నిలంబూర్ (కేరళ), సెప్టెంబర్ 25:లిలి కేరళ నుంచి ప్రారంభమైన రాజకీయ మార్పు దేశవ్యాప్తంగా విస్తరించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు కాంగ్రెస్ శక్తులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్‌గాంధీని భారత ప్రధానమంత్రిగా చూడటమే తన మిగిలిన రాజకీయ ఆకాంక్ష అని పేర్కొన్నారు. కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దాని ప్రభావం ఢిల్లీ రాజకీయాలపైనా ఉంటుందని వ్యాఖ్యానించారు. శుక్రవారం నిలంబూర్‌లో జరిగిన ఆర్యదాన్ ముహమ్మద్ సంస్మరణ కార్యక్రమంలో ఆయనకు ఆర్యదాన్ ముహమ్మద్-2026 ఉత్తమ ప్రజాసేవకుడి అవార్డును ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రదానం చేశారు. రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తెలంగాణలో చేపట్టిన కార్యక్రమాలు, నాయకత్వానికి గుర్తింపుగా రేవంత్‌రెడ్డికి ఈ అవార్డును అందజేశారు. ఈ పురస్కారం అందుకున్న తొలి కేరళేతర వ్యక్తిగా ఆయన నిలిచారు. అవార్డును స్వీకరించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి దేశ రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ భవిష్యత్ లక్ష్యాలు, కేరళ రాజకీయాలపై మాట్లాడారు. దేశంలో ప్రస్తుతం రెండు పరివార్‌ల మధ్య రాజకీయ పోరాటం జరుగుతోందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఒకవైపు సంఘ్ పరివార్, మరోవైపు గాంధీ పరివార్ ఉన్నాయని అన్నారు. దేశంలో సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడేందుకు సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కేరళలో ప్రారంభమైన రాజకీయ సునామీ దేశమంతా విస్తరించి కాంగ్రెస్‌ను కేంద్రంలో అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. భాజపా, ఎన్డీయే బలగాలు ప్రజల స్వేచ్ఛను హరిస్తున్నాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కులం, మతం, ప్రాంతం, భాష ఆధారంగా ప్రజలను విభజించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఓటు, రాజకీయ పార్టీలు, పార్టీ గుర్తులు, నిధులు, ప్రజాస్వామ్య పునాదులతో పాటు యువత భవిష్యత్తుపైనా ప్రభావం చూపుతున్నారని అన్నారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ఆర్యదాన్ ముహమ్మద్ స్ఫూర్తితో పోరాటం చేయాల్సిన

(మిగతా 2వ పేజీలో)



## ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర : మహేశ్‌గౌడ్

అర్హులైన ఓటర్లకూ నోటీసులిస్తున్నారని విమర్శ

గతంలో పలుమార్లు ఓటు వేసిన వారినీ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ

సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్ తప్పుకోవాలని డిమాండ్

అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలన్న మహేశ్ గౌడ్

## రూ.39 లక్షలకు బాలాపూర్ లడ్డూ

దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డి

ఈసారి వేలంలో 9 మంది పోటీపోటీగా పెరిగిన బిడ్లు



## సాహితీ ఇన్‌ఫ్రా కేసులో అరికెపూడి గాంధీకి ఈడీ సమన్లు

రూ. 2.1 కోట్ల నగదు లావాదేవీలపై ఈడీ నోటీసులు

ఈ నెల 27న విచారణకు హాజరు కావాలన్న ఈడీ అధికారులు

పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు



# 13 నెలల్లోనే గూగుల్.. 17 నెలల్లో ఆర్సెలర్.. ఏపీ స్పీడ్ ఇదే: లోకేశ్



**వికసిత్ భారత్ నిర్మాణంలో ఏపీని గ్రోత్ ఇంజన్‌గా నిలుపుతామన్న లోకేశ్**

**అహ్మదాబాద్‌లో గుజరాత్ పారిశ్రామికవేత్తలతో మంత్రి సమావేశం**

**ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడి**

**ప్రభుత్వ పనితీరు బుల్లెట్ ట్రైన్ వేగంతో ఉంటుందని పెట్టుబడిదారులకు హామీ**

**గుజరాత్, ఏపీ కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని వ్యాఖ్య**

2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన గ్రోత్ ఇంజన్‌గా నిలవాలని, ఈ అభివృద్ధి ప్రయాణంలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఆధ్వర్యంలో జరిగిన పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుజరాత్ పారిశ్రామిక స్ఫూర్తి దేశానికి ఆదర్శమని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆ రాష్ట్రం సాధించిన ప్రగతి అద్భుతమని కొనియాడారు. వైబ్రంట్ గుజరాత్ మోడల్

(మిగతా 2వ పేజీలో)

# సీఈసీ జ్ఞానేశ్‌పై కాంగ్రెస్ దేశవ్యాప్త ఆందోళనలు

**అరెస్టు చేసి పదవి నుంచి తొలగించాలని డిమాండ్**

**ఎస్ఐఆర్ వ్యవహారంపై ఎన్నికల సంఘం తీరును ప్రశ్నిస్తూ నిరసనలు**

**పలుచోట్ల నేతల నిర్బంధం.. పాట్నాలో వాటర్ క్యానన్లతో చెదరగొట్టిన పోలీసులు**



న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ వ్యవహరించిన తీరుపై కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. ఎస్ఐఆర్ నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరించారంటూ ఆరోపిస్తూ.. జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. పలు రాష్ట్రాల రాజధానుల్లో ఎన్నికల సంఘం కార్యాలయాల వైపు ర్యాలీలు నిర్వహించగా పోలీసులు పలుచోట్ల అడ్డుకున్నారు. కొందరు నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గ్ మీదుగా నిర్వాచన్ సదన్ వైపు పాదయాత్ర చేపట్టారు. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ర్యాలీని అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు జ్ఞానేశ్‌కుమార్ ముఖంతో కూడిన మాస్కులు ధరించి, చేతులకు సంకెళ్లు వేసుకున్నట్లుగా ప్రదర్శన నిర్వహించారు. నిరసనల్లో పాల్గొన్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అస్సాంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీ నిరసన చేపట్టారు. పార్టీ సీనియర్ నేతలు, ఎంపీ గౌరవ్ గొగోయ్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు ఏర్పాటు చేసిన

(మిగతా 2వ పేజీలో)

# వైభవంగా నిమజ్జనం



ఉపయోగించిన క్రేన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో సుమారు రెండున్నర గంటల ఆలస్యంగా ఉదయం 9.35 గంటలకు శోభాయాత్ర ప్రారంభమైంది. భారీ వాహనంపై మహాగణపతిని ఉంచి సెక్రటేరియట్ మీదుగా ట్యాంక్‌బండ్ వైపు తరలించారు. మార్గమంతా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గణపతి నామస్మరణలు, భజనలు, నృత్యాలతో సందడి చేశారు. శోభాయాత్ర సాగుతున్నంతసేపూ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబరు 4 వద్దకు మహాగణపతి చేరుకున్న అనంతరం నిమజ్జన ప్రక్రియ ప్రారంభమైంది. ముందుగానే అధికారులు నీటిలో గుర్తులు ఏర్పాటు చేసి, నిర్దేశించిన ప్రాంతంలోనే విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. మహాగణపతిని క్రేన్‌తో పైకి ఎత్తి సుమారు 30 నిమిషాల పాటు గాల్లో ఉంచి నలువైపులా తిప్పుతూ జాగ్రత్తగా సాగరంలోకి దించారు. క్రేన్ ఆపరేటర్ బల్విందర్‌సింగ్ చాకచక్యంగా వ్యవహరించడంతో నిమజ్జనం సాఫీగా పూర్తయింది. మహాగణపతి నిమజ్జనం ఎలాంటి అవాంతరాలు లేకుండా పూర్తవడంతో పోలీసులు, అధికారులు, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. పలువురు పాటలకు నృత్యాలు చేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. భక్తులు కూడా గణపతి నామస్మరణలతో సాగరతీరాన్ని మార్మోగించారు.

**ప్రశాంత వాతావరణంలో వేడుకలు: పొన్నం**

హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం అన్ని శాఖలను సమన్వయం చేసి పటిష్ఠ ఏర్పాట్లు చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు భక్తులు, ఉత్సవ నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. శుక్రవారం నిమజ్జన ప్రాంతాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. డీజీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. నిమజ్జన మార్గాలు, నిర్దేశిత పాయింట్ల వద్ద వివిధ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టారని తెలిపారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున గణేశ్ విగ్రహాల తరలింపు, నిమజ్జన ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి నిర్వాహకులు సహకరించాలని మంత్రి కోరారు. శనివారం ఉదయం నాటికి మిగిలిన విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. గణేశ్ పోర్టల్‌లో ఈ ఏడాది 1.24 లక్షల విగ్రహాలు నమోదయ్యాయని వెల్లడించారు. గతేడాది 1.15 లక్షల విగ్రహాలు నమోదయ్యాయని, ఈసారి ఆ సంఖ్య పెరిగిందన్నారు. అపార్ట్‌మెంట్లు, ఇళ్లు, వ్యక్తిగత ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కూడా కలిపితే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3.5 లక్షల నుంచి 4 లక్షల వరకు విగ్రహాలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తయిందన్నారు. మిగిలిన విగ్రహాల నిమజ్జనం శనివారం ఉదయం నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని చెప్పారు.

**పది రోజుల్లో 13 మంది మృతి**

గణేశ్ ఉత్సవాల సందర్భంగా గత పది రోజుల్లో 13 మంది మృతి చెందడం బాధాకరమని డీజీపీ సీవీ ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. నిమజ్జన విధుల కోసం హైదరాబాద్‌కు వచ్చిన కొత్తగూడెం ఎస్ఐ వెంకన్న మృతి దురదృష్టకరమన్నారు. సైబరాబాద్ పరిధిలోని పటాన్‌చెరులో ఆరుగురు మృతి చెందడం విషాదకరమని తెలిపారు. ఖైరతాబాద్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఒకరు మృతి చెందినట్లు, నిర్మల్‌లో గుండెపోటుతో మరొకరు మృతి చెందినట్లు వెల్లడించారు. డీజే శబ్దాల కారణంగా కూడా కొందరు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. వివిధ ప్రమాదాల్లో మొత్తం 26 మంది గాయపడ్డారని, మల్కాజిగిరి పరిధిలోనే 17 మంది గాయపడినట్లు డీజీపీ వివరించారు. వైభవంగా సాగిన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం నగర గణేశ్ ఉత్సవాలకు ప్రధాన ఘట్టంగా నిలిచింది. భక్తుల ఉత్సాహం, అధికార యంత్రాంగం సమన్వయం, పోలీసుల పటిష్ఠ బందోబస్తు మధ్య మహాగణపతి నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

# కేరళ రాజకీయ సునామీ.. దేశమంతా విస్తరించాలి



అవసరం ఉందన్నారు. ఢిల్లీలోని ఎర్రకోటపై ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలన్నదే తన ఆకాంక్ష అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం కాంగ్రెస్ రాజకీయంగా బలోపేతం కావాలని, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. కేరళలో ప్రారంభమయ్యే రాజకీయ మార్పు దేశవ్యాప్తంగా విస్తరించాలని ఆకాంక్షించారు. కేరళ తనకు ఎంతో ఇష్టమైన రాష్ట్రంగా రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం లభించిందన్నారు. రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్‌జోడో యాత్రలో పాల్గొన్నానని, కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొన్నానని గుర్తుచేశారు. కేరళ ప్రజలు సెక్యులరిజానికి అండగా నిలుస్తున్నారని అభినందించారు. కాంగ్రెస్ పార్టీకి, తమ నాయకులకు మద్దతుగా నిలిచిన కేరళ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యదాన్ ముహమ్మద్ కేరళ రాజకీయాల్లో చాణక్యుడిగా, నిలంబూర్‌లో బలమైన నాయకుడిగా పనిచేశారని రేవంత్‌రెడ్డి కొనియాడారు. 1935లో జన్మించిన ఆయన స్వాతంత్ర్యం, సెక్యులరిజం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడారని తెలిపారు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, నాలుగుసార్లు మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. ఏడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన నిజమైన కాంగ్రెస్ నాయకుడని పేర్కొన్నారు. ఆయన సంస్మరణార్థం ఏర్పాటు చేసిన అవార్డును అందుకోవడం గౌరవంగా ఉందన్నారు. ఈ పురస్కారాన్ని ముఖ్యమంత్రి హోదాలో కాకుండా కాంగ్రెస్ కార్యకర్తగా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ సైన్యంలో తాను ఒక సైనికుడినని వ్యాఖ్యానించారు. 2006లో జడ్పీటీసీ సభ్యుడిగా రేవంత్‌రెడ్డి రాజకీయ జీవితం ప్రారంభమైంది. 2007లో ఎమ్మెల్సీగా, 2009, 2014లో ఎమ్మెల్యేగా, 2019లో ఎంపీగా ఎన్నికయ్యారు. అనంతరం కేసీ వేణుగోపాల్, రాహుల్‌గాంధీ ఆయనను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించారు. ఆ తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రాజకీయ జీవితంలో అనుకున్న అనేక లక్ష్యాలను సాధించానని, ప్రస్తుతం తనకు వ్యక్తిగతంగా పెద్దగా ఆకాంక్షలు లేవని ఆయన పేర్కొన్నారు. అయితే రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్న కోరిక మాత్రం మిగిలి ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితే ప్రజాస్వామ్యం పరిరక్షణతో పాటు సామాన్య ప్రజలకు మరింత స్వేచ్ఛ లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ లక్ష్య సాధన కోసం కాంగ్రెస్ శ్రేణులు రాహుల్‌గాంధీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. దేశం కోసం గాంధీ కుటుంబం చేసిన సేవలను రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని అన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలు ఇప్పటివరకు ప్రధానమంత్రి, రాష్ట్రపతి వంటి పదవులు చేపట్టలేదని పేర్కొన్నారు. దేశం కోసం గాంధీ కుటుంబం చేసిన సేవలను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వారి తరఫున పోరాడాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ రాజకీయాల్లో కేరళకు ప్రత్యేక స్థానం ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. కేరళలో చోటుచేసుకునే రాజకీయ పరిణామాలు దేశ రాజకీయాలపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. రుతుపవనాలు కేరళ నుంచే దేశంలోకి ప్రవేశించే విషయాన్ని ప్రస్తావిస్తూ.. వాతావరణ మార్పుల మాదిరిగానే ఇక్కడి రాజకీయ మార్పులు కూడా దేశంలోని ఇతర ప్రాంతాలపై ప్రభావం చూపుతాయని వ్యాఖ్యానించారు. కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే పరిస్థితులు వస్తాయని రేవంత్‌రెడ్డి అన్నారు. గత రాజకీయ పరిణామాలను ఇందుకు ఉదాహరణగా ప్రస్తావించారు. 1991లో కేరళలో కరుణాకరన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేంద్రంలో పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారని గుర్తుచేశారు. 1996లో కేరళలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చిన సమయంలో ఢిల్లీలో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు. 2001లో ఏకే ఆంటోని ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2004లో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. 2016 నుంచి 2026 వరకు కేరళలో పినరయి విజయన్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న సమయంలో కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా ఉన్నారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు కేరళలో కొత్త రాజకీయ వేవ్ కనిపిస్తోందన్నారు. కేరళలో కాంగ్రెస్ బలపడటంతో ప్రారంభమైన ఈ రాజకీయ సునామీ దేశవ్యాప్తంగా విస్తరించి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను ఓడించేలా ప్రభావం చూపుతుందని ఆయన వ్యాఖ్యానించారు. కేరళ నుంచి ప్రారంభమైన రాజకీయ మార్పు దేశమంతా విస్తరించాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి వెళ్లి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఆర్యదాన్ ముహమ్మద్ చూపిన ప్రజాసేవ, సెక్యులరిజం, ప్రజాస్వామ్య విలువల స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.అనిల్‌కుమార్, టీకే బషీర్, అబ్దుల్ వాహెబ్, షౌకత్, ఓజే జనీష్, కేపీ నౌషద్ అలీ, టీపీ అష్రాఫ్ అలీ, కరీం తదితరులతో పాటు ఆర్యదాన్ ముహమ్మద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.






## సీఈసీ జ్ఞానేశ్‌పై కాంగ్రెస్ దేశవ్యాప్త ఆందోళనలు

బారికేడ్ల వద్ద నేతలను అడ్డుకున్నారు. పలువురిని పోలీసులు నిర్బంధించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో భారీ వర్షం మధ్య కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ తదితరులు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్‌పై అనుమానాలను నివృత్తి చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. జమ్మూలోనూ పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. పంజాబ్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లోనూ నిరసనలు జరిగాయి. పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల సంఘం కార్యాలయాల వైపు పాదయాత్రలు చేపట్టారు. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. పాట్నాలో జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ క్యానన్లు ప్రయోగించారు. కొన్ని ప్రాంతాల్లో నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా.. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారమే జరుగుతోందని ఎన్నికల సంఘం గతంలో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ చేపట్టిన దేశవ్యాప్త ఆందోళనలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# రూ.39 లక్షలకు బాలాపూర్ లడ్డూ

### దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డి

### ఈసారి వేలంలో 9 మంది.. పోటాపోటీగా పెరిగిన బిడ్లు



హైదరాబాద్ వినాయక ఉత్సవాల్లో ఎంతో ప్రత్యేకమైన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట ముగిసింది. ఈసారి లడ్డూకు భారీ ధర పలికింది. సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. దీంతో బాలాపూర్ లడ్డూ వేలంలో కొత్త రికార్డు నమోదైంది. ప్రతి ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంపై భక్తుల్లో భారీ ఆసక్తి ఉంటుంది. ఈసారి కూడా లడ్డూను దక్కించుకునేందుకు 9 మంది భక్తులు వేలంలో పాల్గొన్నారు. ఒకరిని మించి మరొకరు బిడ్ పెంచడంతో వేలం ఉత్కంఠగా సాగింది. చివరికి రూ.39 లక్షల వద్ద సామ ప్రణీత్ రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. లడ్డూను దక్కించుకున్న ప్రణీత్ రెడ్డిని ఉత్సవ నిర్వాహకులు, తోటి భక్తులు అభినందించారు. బాలాపూర్ గణేశుడి లడ్డూను దక్కించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. దీంతో ప్రతి ఏడాది ఈ లడ్డూకు వేలంలో భారీ పోటీ నెలకొంటోంది.

# ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర: మహేశ్‌కుమార్ గౌడ్

అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పౌరులకు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ డిమాండ్ చేసినట్టుగా ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. లేకపోతే వారిని ప్రభుత్వం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో పుట్టిన పౌరులకు, గతంలో పలుమార్లు ఓటు వేసిన వారికి కూడా నోటీసులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని అన్నారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జనం అతిపెద్ద పండుగల్లో ఒకటని మహేశ్ కుమార్ చెప్పారు. గణనాథుడిని సాగనంపుతూ రాష్ట్రం వ్యవసాయం, ఆరోగ్యం, విద్య సహా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కోరుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందాలని ఆకాంక్షించారు. మరోసారి ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్‌కు ఉండాలని కోరుకున్నామని చెప్పారు.

# సాహితీ ఇన్‌ఫ్రా కేసులో అరికెపూడి గాంధీకి ఈడీ సమన్లు

సాహితీ ఇన్‌ఫ్రా మనీలాండరింగ్ దర్యాప్తులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. రూ.2.1 కోట్ల నగదు లావాదేవీలపై వివరణ తీసుకునేందుకు ఈ నెల 27న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో ఈడీ అధికారులు పేర్కొన్నారు. సాహితీ ఇన్‌ఫ్రా ఖాతాల నుంచి గాంధీకి సుమారు రూ.2.1 కోట్ల మేర బదిలీ అయినట్లు అధికారులు గుర్తించినట్టు సమాచారం. తెలంగాణ పోలీసుల ఎఫ్ఐఆర్‌ను ఆధారంగా చేసుకుని మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థపై ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో కొనుగోలుదారుల నుంచి నిధులు సేకరించి, వాటిని దారి మళ్లించారనే ఆరోపణలపై ఇప్పటికే విచారణ జరుగుతోంది. ఈ కేసులో సంస్థకు, సంబంధిత వ్యక్తులకు చెందిన ఆస్తులపై గతంలో ఈడీ చర్యలు తీసుకుంది. రూ.161 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేశారు. సాహితీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ బూదాటి లక్ష్మీనారాయణను 2024లో అరెస్ట్ చేశారు.

# 13 నెలల్లోనే గూగుల్.. 17 నెలల్లో ఆర్సెలర్.. ఏపీ స్పీడ్ ఇదే: లోకేశ్

స్ఫూర్తితో ఏపీ కూడా శరవేగంగా దూసుకెళ్తోందని, ఈ ప్రగతిలో గుజరాత్ పారిశ్రామిక రంగం భాగస్వామి కావాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో, వేగవంతమైన నిర్ణయాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఫలితాలే నిదర్శనమని, 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకే వచ్చాయని గుర్తుచేశారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, మాటలకే పరిమితం కాకుండా చేతల్లో వేగం చూపిస్తున్నామని వివరించారు. గుజరాత్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే, ఏపీలో కేంద్రం సహకారంతో 'నాయుడు-మోదీజీ' జోడీతో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వేగానికి ఉదాహరణగా గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టులను లోకేశ్ ప్రస్తావించారు. విశాఖలో గూగుల్ ఏఐ హబ్, డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను కేవలం 13 నెలల్లో పూర్తి చేశామని తెలిపారు. అదేవిధంగా, సుమారు 12 బిలియన్ డాలర్ల పెట్టుబడితో రానున్న ఆర్సెలర్ మిట్టల్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన భూసేకరణ, పర్యావరణ అనుమతులు, పునరావాసం వంటి క్లిష్టమైన ప్రక్రియలను కేవలం 17 నెలల్లో పూర్తి చేశామని వివరించారు. పెట్టుబడిదారుల సమస్యలను వ్యక్తిగత సమస్యగా కాకుండా, వ్యవస్థాగత సమస్యగా చూసి శాశ్వత పరిష్కారాలు చూపుతామని భరోసా ఇచ్చారు. అందుకే కొందరు తనను సరదాగా 'ఆంధ్రా డోలో-650' అని పిలుస్తారని అన్నారు. పెట్టుబడిదారులను కేవలం అనుమతుల కోసం వచ్చేవారిగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా చూస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. 'స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్' అనే మూడు సూత్రాలతో ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో క్లస్టర్ ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా వంటి 23 రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతిలను ప్రత్యేక ఆర్థిక రీజియన్లుగా తీర్చిదిద్దుతామని, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవంతో అమరావతిని కూడా ఉన్నతంగా నిర్మిస్తామని చంద్రబాబు పట్టుదలతో ఉన్నారని అన్నారు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పోటీపడాల్సిన అవసరం లేదని, కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు. ఏపీని తూర్పు భారతదేశానికి వ్యూహాత్మక గేట్‌వేగా వినియోగించుకోవాలని గుజరాత్ పారిశ్రామికవేత్తలను కోరారు. నవంబర్‌లో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తూ, 2047 నాటికి ఏపీ ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ గుజరాత్ ప్రతినిధులు, ఏపీఐఐసీ ఉన్నతాధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# మంత్రి పదవుల్లో, ప్రాంతీయ ప్రాతినిధ్యానికి చోటెక్కడ?



రాజధాని పరిసర జిల్లాల జనాభా, ఆర్థిక ప్రాధాన్యానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం అవసరం. తెలంగాణ రాజకీయాల్లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చర్చ మళ్లీ తెరపైకి వస్తోంది. ఈ సందర్భంగా ఒక ప్రశ్నను విస్మరించలేం. రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, పట్టణాభివృద్ధికి కీలకంగా మారిన హైదరాబాద్--రంగారెడ్డి--మేడ్చల్ ప్రాంతాలకు మంత్రివర్గంలో తగిన ప్రాతినిధ్యం ఉందా? రాజధాని చుట్టూ విస్తరిస్తున్న నగరీకరణ, ఐటీ, రియల్ ఎస్టేట్, పరిశ్రమలు, రవాణా, భూముల సమస్యలు, మౌలిక వసతుల ఒత్తిడి, ఇవన్నీ ఈ ప్రాంతాన్ని రాష్ట్ర పరిపాలనలో అత్యంత కీలకంగా మార్చాయి. అలాంటి ప్రాంతానికి రాజకీయ ప్రాతినిధ్యం కూడా ప్రజల దృష్టిలో ముఖ్యమైన అంశమే. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ అధికారిక జాబితాలో ముఖ్యమంత్రి సహా మంత్రుల నియోజకవర్గాలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందినవిగా ఉన్నాయి. అయితే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి నేరుగా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఎంత అన్నది సహజంగానే చర్చకు వస్తోంది 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలిచిన స్థానాలు పరిమితంగానే ఉన్నాయి. ఇబ్రహీంపట్నం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపు మాత్రం స్పష్టమైన మెజారిటీతో నమోదైంది. ఆయనకు 1,26,506 ఓట్లు లభించగా, సమీప ప్రత్యర్థిపై 36,700 ఓట్ల ఆధిక్యం వచ్చింది ప్రాతినిధ్యం అంటే పదవుల పంపకమేనా? మంత్రివర్గంలో ప్రతి జిల్లాకు తప్పనిసరిగా ఒక పదవి ఇవ్వాలనే రాజ్యాంగ నిబంధన లేదు. మంత్రివర్గ కూర్పులో ప్రాంతం, సామాజిక సమీకరణం, రాజకీయ సమతుల్యత, పరిపాలనా అవసరాలు, పార్టీ అంతర్గత సమీకరణాలు వంటి అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. కానీ ప్రజాస్వామ్యంలో మరో ప్రమాణం కూడా ఉంది. ప్రజలకు తమ ప్రాంతం ప్రభుత్వ నిర్ణయ వ్యవస్థలో వినిపిస్తోందనే నమ్మకం. రాజధాని విస్తరణతో హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల ప్రాధాన్యం పెరుగుతున్న కొద్దీ ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. భూముల సమస్యల నుంచి మౌలిక వసతుల వరకు, పారిశ్రామిక పెట్టుబడుల నుంచి పట్టణ పాలన వరకు ఈ ప్రాంతానికి ప్రత్యేక సవాళ్లు ఉన్నాయి. కుల సమీకరణాల కంటే పనితీరు ముఖ్యం. మంత్రి పదవులపై చర్చ వచ్చినప్పుడల్లా కుల సమీకరణాలు, వ్యక్తిగత సంబంధాలు, రాజకీయ లాబీయింగ్ వంటి అంశాలు ముందుకు వస్తాయి. కానీ ప్రజలకు అవసరమైన ప్రమాణం వేరుగా ఉండాలి. ఎవరు ఏ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు? ఎవరి వద్ద పరిపాలనా అనుభవం ఉంది? ఎవరు ప్రజా సమస్యలను సమర్థంగా ముందుకు తీసుకెళ్లగలరు? ఎవరి పనితీరును కొలవగలం?ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాల ఆధారంగా మంత్రివర్గ కూర్పు జరిగితేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది పునర్వ్యవస్థీకరణ జరిగితే ప్రమాణాలు స్పష్టంగా ఉండాలి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగితే అది కేవలం రాజకీయ సమీకరణాల మార్పుగా కాకుండా పనితీరు ఆధారిత పునర్వ్యవస్థీకరణగా ఉండాలి. ప్రాంతీయ ప్రాతినిధ్యం లోపించిన చోట దాన్ని సరిచేయాలి. దీర్ఘకాలంగా ప్రజా సమస్యలను ముందుకు తీసుకువస్తున్న అనుభవజ్ఞులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో పనితీరుపై ప్రజల్లో ప్రశ్నలు ఉన్నవారిని కూడా సమీక్షించాలి. ఇది ఒక్క రంగారెడ్డి జిల్లాకే పరిమితమైన ప్రశ్న కాదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌తో పాటు ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ, పాత జిల్లాలన్నింటికీ సమతుల్య ప్రాతినిధ్యం ఉండేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. మంత్రి పదవి ఎవరికివ్వాలన్నది రాజకీయ నిర్ణయం. కానీ ఏ ప్రాంతానికీ తన గొంతు ప్రభుత్వంలో వినిపించడం లేదనే భావన రాకుండా చూడటం మాత్రం ప్రజాపాలన బాధ్యత తెలంగాణ అభివృద్ధి ఇక ఒక్క ప్రాంతం చుట్టూ తిరిగే స్థాయిలో లేదు. హైదరాబాద్ రాష్ట్ర ఆర్థిక ఇంజిన్ అయితే, దాని చుట్టూ ఉన్న జిల్లాలు దాని విస్తరణకు కీలక ఆధారం. అందుకే మంత్రివర్గ కూర్పులో కూడా ప్రాంతీయ సమతుల్యత, సామాజిక సమతుల్యత, అనుభవం, పనితీరు, ఈ నాలుగు ప్రమాణాలకు సమాన ప్రాధాన్యం దక్కాలి. ప్రజాప్రభుత్వం అంటే కేవలం సంక్షేమ పథకాలు అమలు చేయడం కాదు. ప్రతి ప్రాంతానికీ ప్రభుత్వం తనదేననే నమ్మకం కల్పించడం కూడా ప్రజాపాలనలో అంతర్భాగమే

**కొలను వెంకటేశ్వర రెడ్డి**



## ఆరోగ్య శిబిరాన్ని సందర్శించిన డీఎస్పీ నాగేంద్రచారి

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: గణేష్ నిమజ్జనం సందర్భంగా అశ్విని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని సిరిసిల్ల డీఎస్పీ శ్రీ నాగేంద్రచారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమానికి హాజరయ్యే భక్తులు, ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచేందుకు శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను డీఎస్పీ అభినందించారు. శిబిరంలో వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు.





## వెంకటేశ్వర మండపంలో ప్రత్యేక పూజలు.. సూర్యనగర్‌లో గణపతి హోమం

వెంకటేశ్వర మండపంలో ప్రతిష్ఠించిన గణనాథునికి నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సి.వై. రాజు, భాస్కర్, చెట్ల లక్ష్మణ్, రాజేష్, సుమిత్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సూర్యనగర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయకుడికి ప్రత్యేక హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. కుసుగుండ్ల మల్లారెడ్డి దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ స్వామివారికి ప్రత్యేక హోమం నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# ఏపీ పొగాకు రైతులకు కేంద్రం తీపి కబురు

## ఏపీలోని ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చేయూత

**ఒక్కో బ్యారన్‌కు రూ. 50,000 చొప్పున వడ్డీలేని రుణం మంజూరు**

**రాష్ట్రవ్యాప్తంగా 44,000 మంది రైతులకు ప్రయోజనం**

**రూ. 220 కోట్ల నిధులు.. నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ**

**మారుతున్న ప్రపంచ మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నిర్ణయం**



ఆంధ్రప్రదేశ్‌లోని ఫ్లూ-క్యూర్డ్ వర్జీనియా (ఎఫ్‌సీవీ) పొగాకు రైతులకు ఊరట కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మారుతున్న ప్రపంచ మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సకాలంలో ఆర్థిక చేయూత అందించే లక్ష్యంతో, ఒక్కో బ్యారన్‌కు రూ. 50,000 చొప్పున వడ్డీలేని రుణాన్ని ఒకే దఫాలో అందించేందుకు శుక్రవారం ఆమోదం తెలిపింది. 'వడ్డీలేని వర్కింగ్ క్యాపిటల్ సహాయ పథకం' కింద ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 44,000 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం కేంద్రం దాదాపు రూ. 220 కోట్లను కేటాయించింది. ఈ మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతిలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయనున్నారు. ఈ తక్షణ ఆర్థిక సాయం ద్వారా రైతులు తమ కుటుంబ అవసరాలు తీర్చుకోవడంతో పాటు, సంస్థాగత రుణాలను చెల్లించడానికి, రాబోయే పంట సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు వంటి వాటిని కొనుగోలు చేయడానికి వీలు కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో ప్రైవేట్ అప్పులపై రైతులు ఆధారపడటాన్ని తగ్గించడం కూడా ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఆంధ్రప్రదేశ్‌లోని నల్ల రేగడి, దక్షిణ తేలికపాటి నేలల్లో పండించే ఎఫ్‌సీవీ పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. తక్కువ నికోటిన్, మంచి రంగు వంటి లక్షణాల కారణంగా ఎగుమతుల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. రాష్ట్రంలో 2025-26 పంట సీజన్‌కు సంబంధించిన వేలం ప్రక్రియ మార్చి 25, 2026న ప్రారంభం కాగా, ఇప్పటివరకు సుమారు 100 మిలియన్ కిలోల పొగాకును వేలం వేసినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా పొగాకు మార్కెట్‌లో మారుతున్న డిమాండ్, భౌగోళిక రాజకీయ పరిణామాలు, అంతర్జాతీయ వాణిజ్య పోకడల కారణంగా పంట సేకరణ, మార్కెటింగ్‌పై ప్రభావం పడుతోందని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో, పంట సేకరణను సులభతరం చేయడానికి, మార్కెట్‌లో భాగస్వామ్యాన్ని పెంచడానికి, ఎగుమతులను ప్రోత్సహించడానికి సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఎగుమతిదారులు, కొనుగోలుదారులు, రైతులతో నిరంతరం చర్చిస్తూ పొగాకు రంగాన్ని బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించింది.

## సంపాదకీయం

# ఎన్నికల సంఘంపై నిరసనలు.. ప్రజాస్వామ్య విశ్వాసానికి పరీక్ష

భారత ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘానికి అత్యంత కీలకమైన స్థానం ఉంది. ఎన్నికలు నిర్వహించడం మాత్రమే కాదు.. ఓటర్ల జాబితాల రూపకల్పన, సవరణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించడం వంటి అనేక బాధ్యతలను రాజ్యాంగబద్ధ సంస్థగా ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. అందుకే ఆ సంస్థ తీసుకునే ప్రతి నిర్ణయం రాజకీయ పార్టీలకే కాకుండా సామాన్య ఓటర్లలోనూ విశ్వాసాన్ని కలిగించాలి. ప్రస్తుతం ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాల నిరసనలు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై వివాదం ఈ అంశాన్ని మరోసారి దేశవ్యాప్త చర్చగా మార్చాయి.

2026 సెప్టెంబర్ 25న కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిర్వహించిన నిరసనల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఢిల్లీతో పాటు జమ్మూ, బిహార్, అసోం, ఉత్తరాఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, చండీగఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. కొన్ని చోట్ల పోలీసులు నిరసనకారులను చెదరగొట్టేందుకు నీటి ఫిరంగులు, భాష్పవాయువు ప్రయోగించారు.

ఈ నిరసనలకు ప్రధాన నేపథ్యం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ. ఓటర్ల జాబితాలను శుద్ధి చేయడం ఎన్నికల నిర్వహణలో సాధారణ ప్రక్రియే. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, నకిలీ లేదా డూప్లికేట్ నమోదులను గుర్తించి తొలగించడం అవసరమే. అదే సమయంలో నిజమైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. ఒకరి పేరు ఓటర్ల జాబితా నుంచి తొలగిపోతే ఎన్నికల రోజున ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల సవరణ ప్రక్రియలో పారదర్శకత, ప్రజలకు అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం, వాటిని పరిష్కరించే వ్యవస్థలు కీలకం.

ప్రస్తుత వివాదానికి మరో కారణం ఎన్నికల సంఘం అంతర్గతంగా నిర్ణయాలపై అభిప్రాయ భేదాలు ఉన్నాయంటూ వచ్చిన వార్తలు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి కొన్ని నిర్ణయాలు, ఉత్తర్వులపై గత పది నెలల్లో పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం--6లో మార్పులు, ఓటర్ల జాబితా సమాచార వ్యవస్థపై నియంత్రణ, ప్రత్యేక సమగ్ర సవరణ తదితర అంశాలు ఆ అభ్యంతరాల్లో ఉన్నట్లు వెల్లడైంది. అయితే ఎన్నికల సంఘం మాత్రం కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు సహజమేనని, తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని చెబుతోంది.

ఇక్కడే అసలు ప్రజాస్వామ్య ప్రశ్న మొదలవుతుంది. ఎన్నికల సంఘం నిర్ణయాలు చట్టబద్ధంగా ఉండటం ఎంత ముఖ్యమో.. అవి ప్రజలకు, రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు నిష్పక్షపాతంగా కనిపించడం కూడా అంతే ముఖ్యం. రాజ్యాంగ సంస్థల విశ్వసనీయత కేవలం చట్టపరమైన అధికారాలతో నిలబడదు. ప్రజల్లో ఏర్పడే నమ్మకంతోనే అవి బలపడతాయి. ఎన్నికల ప్రక్రియపై అనుమానం పెరిగితే దాని ప్రభావం ఒక్క ఎన్నికతో ముగియదు. ప్రజాస్వామ్య వ్యవస్థ మొత్తంపై విశ్వాసాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది.

ప్రతిపక్ష పార్టీలు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతున్నాయని, ఓటర్లను అదనపు పత్రాలు సమర్పించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాల్లో లేకపోవడంపై పౌర సమూహాలు, రాజకీయ పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఇలాంటి ఆరోపణలు న్యాయపరంగా తుది నిర్ధారణ పొందిన వాస్తవాలుగా చూడకూడదు. ఎన్నికల సంఘం తన ప్రక్రియ చట్టబద్ధమైనదేనని చెబుతోంది.

ప్రజాస్వామ్యంలో ఆరోపణలు రావడం కొత్త కాదు. రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిర్ణయాలను ప్రశ్నించవచ్చు. ప్రజలు కూడా తమ ఓటు హక్కుకు సంబంధించిన అంశాలపై వివరణ కోరవచ్చు. కానీ ఆరోపణలకు సమాధానం నిరసనలతోనే ఇవ్వాల్సిన అవసరం లేదు. స్పష్టమైన సమాచారం, ప్రజలకు అందుబాటులో ఉండే గణాంకాలు, ప్రతి తొలగింపునకు కారణాలు, అభ్యంతరాల పరిష్కార వివరాలు అందించడం ద్వారా ఎన్నికల సంఘం మరింత బలమైన సమాధానం ఇవ్వగలదు. అదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా నిర్ధారణ కాని ఆరోపణలను తుది సత్యాలుగా ప్రచారం చేయకుండా ఆధారాలతో తమ అభ్యంతరాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి.

ప్రస్తుతం వివాదం ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యక్తిగత వ్యవహారంగా పరిమితం కావడం సరైంది కాదు. సమస్యను ఒక వ్యక్తి రాజీనామా చేయాలా వద్దా అన్న స్థాయిలో మాత్రమే చూడటం కంటే.. ఎన్నికల సంఘం స్వతంత్రత, నిర్ణయ ప్రక్రియ, ఓటర్ల జాబితాల నిర్వహణ, రాజకీయ పార్టీలతో సంప్రదింపులు, ఫిర్యాదుల పరిష్కారం వంటి వ్యవస్థాగత అంశాలపై చర్చ జరగాలి. వ్యక్తులపై రాజకీయ పోరాటంగా మారితే అసలు వ్యవస్థాపరమైన ప్రశ్నలు వెనుకబడిపోయే ప్రమాదం ఉంది.

ఇటీవల ఎన్నికల సంఘంలో నియామక వ్యవస్థపైనా రాజకీయ చర్చ జరుగుతోంది. 2023లో వచ్చిన చట్టం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత ఉంటారు. అంతకుముందు ఉన్న వ్యవస్థలో భారత ప్రధాన న్యాయమూర్తి పాత్ర ఉండేది. ఈ మార్పుపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. 2026 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టులో ఈ చట్టాన్ని సవాలు చేసిన పిటిషన్లపై ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

ఇలాంటి పరిణామాల మధ్య ఎన్నికల సంఘం స్వతంత్రతపై చర్చ మరింత విస్తరించడం సహజం. అయితే స్వతంత్రత అంటే ఎవరి విమర్శలకు అతీతంగా ఉండటం కాదు. రాజ్యాంగబద్ధ సంస్థపై విమర్శలు రావడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం కాదు. విమర్శలకు సమాధానం చెప్పే సంస్థాగత సామర్థ్యం లేకపోవడమే సమస్యగా మారుతుంది. ఎన్నికల సంఘం తన నిర్ణయాలకు సంబంధించిన ఆధారాలను ఎంత ఎక్కువగా బహిరంగపరుస్తే అంత ఎక్కువగా ప్రజల్లో విశ్వాసం పెరిగే అవకాశం ఉంటుంది.

అదేవిధంగా నిరసనలకు కూడా ప్రజాస్వామ్యంలో ప్రత్యేక స్థానం ఉంది. శాంతియుతంగా ఆందోళన నిర్వహించడం పౌరుల హక్కు. ఎన్నికల వ్యవస్థపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి రాజకీయ పార్టీలు, పౌర సమాజం, విద్యార్థి సంఘాలు నిరసనలు చేపట్టవచ్చు. కానీ ఆ నిరసనలు హింసకు దారితీయకుండా, ప్రజా ఆస్తులకు నష్టం కలగకుండా, సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిర్వహించడం కూడా ప్రజాస్వామ్య బాధ్యతే.

ఓటర్ల జాబితాల విషయంలో మరో ముఖ్యమైన అంశం ఉంది. ఒకవైపు అనర్హులు, డూప్లికేట్ పేర్లు, మరణించిన వారి పేర్లు తొలగించాల్సిన అవసరం ఉంటుంది. మరోవైపు పేదలు, వలస కార్మికులు, నిరాశ్రయులు, వృద్ధులు, అక్షరాస్యత తక్కువగా ఉన్నవారు, పత్రాల సమస్యలు ఎదుర్కొనే పౌరులు తమ పేర్లు జాబితాలో కొనసాగించుకోవడం కోసం అదనపు ఇబ్బందులు పడకూడదు. ఎన్నికల జాబితా శుద్ధి అనే లక్ష్యం, ఓటు హక్కు రక్షణ అనే లక్ష్యంతో సమతుల్యంగా సాగాలి. ఏ ఒక్క లక్ష్యాన్ని సాధించడానికి మరొకదాన్ని బలహీనపరచకూడదు.

**ముఖ్యంగా మొదటిసారి ఓటు వేయబోయే యువత విషయంలో ప్రక్రియ సులభంగా ఉండాలి. ఫారం--6లో చేసిన మార్పులపై ఎన్నికల కమిషనర్ల మధ్య అభ్యంతరాలు వ్యక్తమయ్యాయన్న వార్తలు ఈ అంశాన్ని మరింత ప్రాధాన్యంగా మార్చాయి. ఆ మార్పుల చట్టబద్ధతపై ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. ఎన్నికల సంఘం విధానాలు చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాన్ని తగిన న్యాయ, సంస్థాగత ప్రక్రియల ద్వారా స్పష్టతకు తీసుకురావడం అవసరం.**



**-గుర్రం పాపిరెడ్డి**
**ఎడిటర్**

# విద్యార్థుల భద్రత విషయంలో గురుకుల పాఠశాల యాజమాన్యం సంబంధిత అధికారుల నిర్లక్ష్యం

## ఎస్ఎఫ్ఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురుకుల గేటు ముందు ధర్నా

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ మరియు సిపిఎం ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ,కళాశాలలో ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గేటు ముందు ధర్నా చేయడం జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్ మరియు సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న మాట్లాడుతూ విద్యార్థుల భద్రత విషయంలో గురుకుల పాలకుర్తి పాఠశాల యాజమాన్యం మరియు సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల జీవితాల అయోమయంలో ఉన్నాయని అన్నారు విద్యార్థులకు కనీస భద్రత కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటుగా భావించడం జరుగుతుందని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం ముందుకు తీసుకెళుతున్నానని గొప్పలు చెబుతూ పెద్దపెద్ద వాగ్దానాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పాలకుర్తి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి క్యాంప్ ఆఫీస్ అనుకొని ఉన్న గురుకుల లోనే ఇలాంటి దుస్థితి ఉంటే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగాన్ని ఎలా ఉందో గమనించాల్సిన అవసరం ఉందని అన్నారు ఈ ఒక ఘటన పైన సంబంధిత జిల్లా కలెక్టర్ గురుకులాల సెక్రటరీ స్పందించి నిర్లక్ష్యం వహించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని




డిమాండ్ చేశారు లేనియెడల ఎస్ఎఫ్ఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గం లో పెద్ద ఎత్తున ఆందోళనను చేస్తామని హెచ్చరించారు విద్యార్థులకు తగు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలం చెందుతున్న యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పాలకుర్తి మండల తాసిల్దార్ కి విద్యార్థుల పక్షాన పలు డిమాండ్లతో కూడిన మెమోరండం ఇవ్వడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎదునూరి మదర్ ముసుకు ఇంద్రారెడ్డి ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా గర్ల్స్ కన్వీనర్ కడారి మానస మండల అధ్యక్ష కార్యదర్శులు మండల నాయకులు ప్రశాంత్ శ్రీకాంత్ అరవింద్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు

# మూఢనమ్మకాలకు చెక్ పెట్టాలి.. గ్రామాల్లో అవగాహన కల్పించాలి

## జింకలగూడెంలో మహిళను పరామర్శించిన సీపీఎం బృందం

అరుణ ప్రభ :- బూర్గంపాడు గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించాల్సిన అవసరం ఉందని సీపీఎం బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సీపీఎం బృందం బూర్గంపాడు మండలం జింకలగూడెం గ్రామాన్ని సందర్శించి, ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియోకు సంబంధించి సకీనాబీని కలిసి వివరాలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా సకీనాబీ మాట్లాడుతూ.. తనకు రెండు నెలలుగా ఆరోగ్యం సరిగా లేకపోవడం, జ్వరం తదితర అనారోగ్య సమస్యల కారణంగా కుటుంబ సభ్యులు ఒక విధంగా వ్యవహరించారని తెలిపారు. తనను ఎవరూ బలవంతం చేయలేదని, ఎవరూ కొట్టలేదని, ఇబ్బంది పెట్టలేదని ఆమె స్పష్టం చేసినట్లు సీపీఎం బృందం తెలిపింది. ఈ ఘటనపై కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె పేర్కొన్నట్లు వెల్లడించింది. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచం ఎంతో ముందుకు వెళ్తున్నప్పటికీ గ్రామాల్లో మూఢనమ్మకాలు కొనసాగడం ఆందోళనకరమన్నారు. దెయ్యాలు, భూతాలు వంటి నమ్మకాల పేరుతో ప్రజలు భయపడకుండా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రజలకు కౌన్సెలింగ్ నిర్వహించి మూఢనమ్మకాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంతో పాటు పోలీసులపైనా ఉందన్నారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు కేవలం కేసులు నమోదు చేయడం



కంటే, పరిస్థితిని అర్థం చేసుకుని ప్రజలకు సరైన అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామ పెద్దలు, ప్రజలకు శాస్త్రీయ ఆలోచనలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్.కె అబిదా, గుంటక కృష్ణ, ఎస్.కె హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు

# జడ్పీ రోడ్డుపై గుంతలు పూడ్చాలి

## ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన గోతులు

## తక్షణమే డిప్యూటీ కమిషనర్ పరిశీలించి చర్యలు తీసుకోవాలి: బీజేపీ నాయకులు

ఎల్బీనగర్ సెప్టెంబర్ 25( అరుణ ప్రభ): హైద్రాబాద్ బైరామల్‌గూడ డివిజన్ పరిధిలోని బి.ఎన్. రెడ్డి నగర్ నుంచి టీకేఆర్ కమాన్ వరకు ఉన్న జడ్పీ రోడ్డుపై నెలల తరబడి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, వర్షపు నీరు మరియు కాలనీల నుంచి వచ్చే నీరు ఆ గోతుల్లో నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. రోడ్డుపై గోతుల్లో నీరు నిలిచిపోవడంతో అవి కనిపించకపోవడం వల్ల రాకపోకలు సాగించే ప్రజలు, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న మహిళలు, పురుషులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలువురు కిందపడిపోయి కాళ్లు, చేతులకు గాయాలు చేసుకుంటున్నారని, ఈ గోతులు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నెలల తరబడి సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్లే బీజేపీ ఆధ్వర్యంలో నేడు నిరసన కార్యక్రమం చేపట్టాల్సి వచ్చిందని నాయకులు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని బైరామల్‌గూడ డిప్యూటీ కమిషనర్ (డీసీ) వెంటనే జడ్పీ రోడ్డును స్వయంగా సందర్శించి, పరిస్థితిని పరిశీలించి, గుంతలను తక్షణమే పూడ్చడంతో పాటు రహదారికి అవసరమైన శాశ్వత మరమ్మతులు



చేపట్టాలని బీజేపీ పార్టీ తరఫున విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై అధికారులు ఇకనైనా స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బైరామల్ గూడ డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్, బొగ్గుల మాధవరెడ్డి, జనరల్ సెక్రటరీ అమర్నాథ్ రెడ్డి, గౌని వెంకటేష్ గౌడ్, కంది శ్రీనివాస్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు వెంకటాచారి, శక్తి కేంద్ర ఇన్‌చార్జి రాజవర్ధన్ రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు విజయశ్రీ చౌదరి, లక్ష్మీకాంత్ రెడ్డి, మణి గౌడ్, నరేష్, విజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతాప్‌రెడ్డి లేఅవుట్‌లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

## 11 రోజులపాటు నిత్య పూజలు..

## ఘనంగా లడ్డూ వేలం పాట.. వైభవంగా శోభాయాత్ర



పెద్ద అంబర్‌పేట్ సెప్టెంబర్ 25 (అరుణ ప్రభ) పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాప్‌రెడ్డి లేఅవుట్ కాలనీలో మహాదేవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గత రెండేళ్లుగా కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది 11 రోజులపాటు గణనాథుడికి నిత్య పూజలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణేష్ లడ్డూ, కండువాలు, పంచా తదితర వస్తువుల వేలం పాటకు కాలనీ వాసులు, భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఉత్సాహంగా సాగిన వేలం పాటలో పలువురు పాల్గొని వస్తువులను దక్కించుకున్నారు. **వేలం వివరాలుద:** లడ్డూ: నెల్లకంటి శంకర్ యాదవ్ దంపతులు - రూ.41,116, కండువా: యానాల లింగారెడ్డి దంపతులు - రూ.5,116, పంచా: సూరిశెట్టి ప్రహ్లాద్ దంపతులు - రూ.2,116, 2 చిన్న కండువాలు: ఎన్. తరుణ్‌కుమార్ యాదవ్ దంపతులు -రూ.1,516, 1 చిన్న కండువా: గుంట్ల రాంబాబు దంపతులు -రూ.616 గత సంవత్సరం గణేష్ లడ్డూ వేలం పాటలో పాల్గొని లడ్డూను దక్కించుకున్న వారిని కూడా ఈ సందర్భంగా మహాదేవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే ఉత్సవాల నిర్వహణకు సహకరించిన హౌస్ ఓనర్స్, ప్లాట్ ఓనర్స్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. 11 రోజులపాటు నిత్య పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జనం సందర్భంగా గణేష్ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, భక్తుల నామస్మరణలు, జై గణేష్ నినాదాలతో పాటు డ్యాన్స్‌లు, కోలాటాలతో శోభాయాత్ర ఉత్సాహంగా సాగింది. కాలనీ వాసులు, యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. దీంతో 11 రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మహాదేవ్ యూత్ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# కోతుల బెడద నివారణకు బొప్పాపూర్ పాలకవర్గం చర్యలు



### ::: కోతులు పట్టే సిబ్బందికి బయానా అందజేత

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 25: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో కోతుల బెడదను నివారించేందుకు గ్రామ పాలకవర్గం చర్యలు చేపట్టింది. కోతుల సంచారంతో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం చూపేందుకు కోతులను పట్టే సిబ్బందితో పాలకవర్గం శుక్రవారం చర్చించింది. గ్రామంలో కోతులను పట్టి, వాటి బెడదను తగ్గించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఇందుకోసం కోతులు పట్టే వారికి ముందస్తుగా బయానా (అడ్వాన్స్) కూడా అందజేశారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో కోతుల సంచారాన్ని నియంత్రించేలా చర్యలు చేపట్టనున్నట్లు పాలకవర్గం తెలిపింది. కోతుల బెడద కారణంగా ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు కొనసాగిస్తామని సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి--శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు ముత్యాల చంద్రారెడ్డి, బొమ్మణవేణి వెంకటేష్, చల్ల పద్మారెడ్డి, నాయకులు ల్యాగల సతీష్, నీరటి భాను తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన శాసనసభ్యులు డా పట్లోళ్ల సంజీవరెడ్డి వారి సోదరుడు డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి గారు నియమితులైన సందర్భంగా గౌరవ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి గారి స్వగృహం హైదరాబాదులో శాలువా కప్పి బొకే ఇస్తూ డిసిసి ఎన్నికకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపిన శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి గారు . ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డికి మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఈ సందర్భంగా తెలియజేశారు.



## సీనియర్ నాయకుడు ఏఐసీసీ పరిశీలకుడు మెయప్పన్ గారికి మర్యాదపూర్వకంగా కలిసిన శాసనసభ్యులు డా పట్లోళ్ల సంజీవరెడ్డి వారి సోదరుడు డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి.

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి నియమితులైన సందర్భంగా గౌరవ సీనియర్ నేత ఏఐసీసీ పరిషిలకుడు మెయప్పన్ గారికి కలిసి శాలువా కప్పి బొకే ఇస్తూ డిసిసి ఎన్నికకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపిన శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి గారు . ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డికి మెయప్పన్ గారు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఈ సందర్భంగా తెలియజేశారు .

## జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శనివారం పర్యటన కార్యక్రమాల షెడ్యూల్ వివరాలు



ఉదయం 9:00 గంటలకు : నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 50 లక్షలతో మంజూరైన శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం, అలాగే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు పాల్గొంటారు. ఉదయం 11:00 గంటలకు : నారాయణఖేడ్ పట్టణంలో నారాయణఖేడ్, కల్హేర్, నిజాంపేట్, కంగ్టి, సిర్గాపూర్ మండలాలకు సంబంధించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మరియు జవీ=ఖీ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా అందజేయడం జరుగుతుంది. మధ్యాహ్నం 2:00 గంటలకు : నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని బాలసదనంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లిం మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. కావున సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్, చీాఖ×, మహిళా కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాము.

## సాహితి ఇన్ఫ్రా కేసులో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడి సమన్లు

### రూపాయలు 2.1 కోట్ల లావాదేవీలపై విచారణకు పిలుపు

### తమకు ఎటువంటి నోటీసులు అందలేదన్న ఎమ్మెల్యే గాంధీ పిఏ గంగుల రమేష్



శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 25(అరుణ ప్రభ) : సాహితి ఇన్ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మనీలాండరింగ్ కేసులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడి సమన్లు జారీ చేసినట్టు సమాచారం సెప్టెంబర్ 27 న విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు తెలుస్తుంది. సాహితి ఇన్ఫ్రా నుంచి ఎమ్మెల్యే గాంధీ బ్యాంకు ఖాతాల ద్వారా సుమారు రూ. 2.1. కోట్లు బదిలీ అయినట్టు ఈడిదర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఈ లావాదేవీల స్వభావం, నిధుల వినియోగం, వాటికి సంబంధించిన వ్యాపార కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలుస్తుంది. సాహితి ఇన్ఫ్రా ప్రాజెక్టుల్లో కొనగోలుదారుల నుంచి భారీగా నిధులు సేకరించి మోసం చేశారన్న ఆరోపణలపై దర్యాప్తుకొనసాగుతుంది. అయితే ఎమ్మెల్యే గాంధీ పిఏ గంగుల రమేష్ స్పందిస్తూ తమకు ఎలాంటి నోటీసులు అందలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లారని తెలిపారు. దీంతో ఈడి నోటీసుల వ్యవహారం పై స్పష్టత రావాల్సి ఉంది.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక



# ముఖ్యమంత్రి సభా స్థలాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : ఈ నెల 30వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభ నేపథ్యంలో సభా ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతేతో కలిసి సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున సభా ప్రాంగణంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు హాజరయ్యే సమయంలో పట్టణంలోకి ప్రవేశించే మార్గాలు, కాన్వాయ్ రాకపోకలకు సంబంధించిన రూట్‌ను పరిశీలించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, చంద్రంపేట చౌరస్తా ప్రాంతాలను ప్రత్యేకంగా పరిశీలించి, ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భారీగా తరలివచ్చే ప్రజల దృష్ట్యా పార్కింగ్ ప్రదేశాల గుర్తింపు, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

# గొల్లపల్లిలో ఘనంగా వినాయక నిమజ్జనం

భక్తిశ్రద్ధల మధ్య శోభాయాత్ర.. ప్రత్యేక పూజలు చేసిన డీఎస్పీ నాగేంద్ర చారి దంపతులు.

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 25: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. గ్రామ పురోహితులు, తిమ్మాపూర్ ప్యాక్స్ వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ, వీర శివాజీ యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి దంపతులు నిమజ్జన కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం యూత్ సభ్యులతో కలిసి నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. నీటి ప్రదేశాల వద్ద ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగలు, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని తెలిపారు. పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. నిమజ్జన శోభాయాత్రలో సీఐ ఓ. వెంకటేష్, ఎస్సై ఎన్. రమేష్ పాల్గొని భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించామని సర్పంచ్



కొండ రమేష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు జబ్బర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది, వీర శివాజీ యూత్ సభ్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

## ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి చేయాలి: ఎస్పీ మహేష్ బి. గీతే



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 25: సిరిసిల్ల పట్టణ పరిధిలోని మానేరు బ్రిడ్జి వద్ద జరుగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలీస్ అధికారులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లు, బందోబస్తు చర్యలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు లహరి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో నిమజ్జన బందోబస్తు విధులకు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బందితో ఎస్పీ సమావేశమయ్యారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు. నిమజ్జన కార్యక్రమాలు నిర్దేశించిన సమయానికి పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బందోబస్తులో ఉన్న పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ కార్యక్రమంలో శోభాయాత్రగా తరలివెళ్తున్న బొజ్జ గణనాథులకు ఘన స్వాగతం పలికిన టిపిసిసి మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లిటిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి గారులి ఈ రోజు కొత్తపేట చౌరస్తాలో లిగణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీలి చైర్మన్ లిపున్న గణేష్ నేత గారులి సెక్రటరీ లిబండి మధుసూదన్ రావు గార్లలి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించిన శోభాయాత్రగా తరలివెళ్తున్న బొజ్జ గణనాథులకు ఘన స్వాగతం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా నిమజ్జనానికి శోభాయాత్రగా తరలివెళ్తున్న బొజ్జ గణనాథుల విగ్రహాలపై లిదేప భాస్కర్ రెడ్డి గారులి పూలవర్షం కురిపించి, భక్తులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి గారు మాట్లాడుతూ... గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శోభాయాత్రను ఎంతో బాధ్యతాయుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో విలసిల్లాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లిధనరాజ్ గౌడ్‌లి ఎన్టీఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లిముప్పిడి లింగస్వామి గౌడ్‌లి బీసీ సంఘం నాయకులు లిగట్ల రవీంద్రలి కాంగ్రెస్ పార్టీ నాయకులు లిచిక్కుల్ల శివ ప్రసాద్‌లి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ లితలాటి రమేష్ నేత, యాదవ్ రెడ్డి, పందుల వెంకటేష్ గౌడ్,జ్ఞానేశ్వర్



యాదవ్,జగన్నాథం, భూపాల్ రెడ్డి,జంగారెడ్డి, పగడాల ఎల్లయ్య, బర్రె రాజకుమార్, ఇమ్రాన్ అలీ,పెద్దవూర సైదులు, లక్ష్మీనారాయణ, చిలుకరాజు సాయి జగదీష్, రంజిత్,సంతోష్, భాస్కర్, భార్గవ్ గౌడ్,లి ,గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల దే కీలక పాత్ర

## రేడియో మాజీ డైరెక్టర్ వేణు గోపాల్




గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): : స్వాతంత్ర ఉద్యమం నాటి నుండి ప్రజలను పత్రికలు చైతన్య పరుస్తూ పనిచేస్తున్నాయని సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల కీలక పాత్ర వహిస్తారని కాలానుగుణంగా మారుతున్న టెక్నాలజీ పై అవగాహన పెంచుకోవాలని ఆలిండియా రేడియో మాజీ డైరెక్టర్ వేణుగోపాల్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ఎస్కెఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో వన్డే నేషనల్ వర్క్ షాప్ అండ్ జర్నలిజం రిపోర్టింగ్ అండ్ ఎడిటింగ్ టెక్నాలజీ కార్యక్రమం నిర్వహించారు .ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ నాగసూరి వేణుగోపాల్ పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు. ముందుగా సరస్వతి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి వేణుగోపాల్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలలో జర్నలిజం లో అనేక మార్పులు వచ్చాయని పత్రికలు రేడియో టీవీలు సెల్ ఫోన్ ఇంటర్నెట్ సోషల్ మీడియా విస్తృతంగా ఉన్నాయని అన్నారు. సమాజంలో ఎన్నో సమస్యలు ను జర్నలిస్టులు వెలుగులోకి తీసుకు వస్తారని మారుతున్న సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని నిబద్ధత నిజాయితీగా వార్తలు అందించాలని సూచించారు. మరో అతిథి ఫార్మర్ సబ్ ఎడిటర్ విశాలాంధ్ర నేషనల్ డైలీ తిమ్మప్ప మాట్లాడుతూ ఒకప్పుడు వ్యవస్థగా పనిచేస్తున్న పత్రికా రంగం నేడు వ్యక్తుల పరంగా మారిపోయిందని సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు సమాజంలో సమస్యలపై విద్యార్థుల అవగాహన పెంచుకోవాలని పత్రిక , ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నెల కంటి శ్రీధర్ ,ప్రిన్సిపాల్ రాంప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి ,కన్వీనర్ సురేంద్ర, రమణారెడ్డి ,అధ్యాపకులు జర్నలిస్టులు, విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు.



## మాసబ్ చెరువు వద్ద ఘనంగా వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

### భక్తులు అధికారులకు సహకరించి నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రసిద్ధ మాసబ్ చెరువు వద్ద జరుగుతున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన కార్యక్రమాల్లో ఆయన స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జన వేడుకల కోసం కోహెడ, ఇంజాపూర్, వనస్థలిపురం, హస్తినాపురం, మీర్‌పేట్, హయత్‌నగర్, ఎల్బీనగర్, అబ్దుల్లాపూర్ మెట్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి గణనాథులు భారీ సంఖ్యలో మాసబ్ చెరువు వద్దకు తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం తరఫున అన్ని మౌలిక వసతులు, భారీ బందోబస్తు మరియు ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేశామని ఆయన స్పష్టం చేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులందరూ పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు సహకరిస్తూ, వేడుకలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): పార్టీలకతీతంగా సీఎం సహాయనిధి అందిస్తున్నామని పేదవాడి ఆరోగ్య విషయంలో నాయకులు రాజకీయాలు చేయవద్దని ఎవరికైనా సీఎం సహాయనిధి కావాలంటే పార్టీ కార్యాలయంలో సంప్రదించాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు .గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుండి మంజూరైన 58 లక్షల రూపాయల 122 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందజేశారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈరోజు 29వ సారి సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్నామని గత వైసిపి ప్రభుత్వం లో ఒక్కరికి కూడా సీఎం సహాయనిది ఇవ్వలేదని గుర్తు చేశారు సహాయ నిధి పొందిన వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని గుర్తుంచుకోవాలని పనిచేసే ప్రభుత్వాన్ని మరలా గెలిపించాలని కోరారు. కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, పులిమి శ్రీనివాసులు , ముమ్మడి వెంకటేశ్వర్లు, లీలావతి ,దశరథ రామిరెడ్డి ,వైయస్సార్, భాస్కర్ రెడ్డి ,పలు మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## రూ.90,999కు గణేష్ లడ్డూ..!

### గజ్వేల్ ఎన్‌సీఆర్ ద్వారక వెంచర్‌లో ఉత్కంఠభరిత వేలం

### ద్వారక వెంచర్ గణపతి లడ్డు వేలం 90,999లకు దక్కించుకున్న బుడికె గంగా జీవన్ దాపంతులు

గజ్వేల్ అరుణ ప్రభ : గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గజ్వేల్‌లోని ఎన్‌సీఆర్ ద్వారక వెంచర్‌లో ప్రతిష్టించిన వినాయకుడి లడ్డు వేలం పాట ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. కాలనీవాసులు, భక్తులు పోటాపోటీగా పాల్గొన్న ఈ వేలంలో బుడికె గంగా జీవన్ దాపంతులు ?90,999/- (తొంభై వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది రూపాయలు) పలికి స్వామివారి ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో దక్కించుకున్నారు. ?లడ్డును కైవసం చేసుకున్న అనంతరం గంగా జీవన్ దాపంతులు మాట్లాడుతూ... విఘ్నేశ్వరుడి లడ్డును వేలంలో పొందడం తన పూర్వజన్మ సుకృతమని, గణనాథుడి ఆశీస్సులతో కాలనీ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ?ఈ వేలం ద్వారా సమకూరిన నిధులను సేవా కార్యక్రమాలకు, రాబోయే ఉత్సవాల నిర్వహణకు వెచ్చించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్, వెంచర్ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పోలీస్ వెల్ఫేర్ షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమిపూజ

### రూ.70 లక్షల వ్యయంతో నిర్మాణం

ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో పోలీస్ వెల్ఫేర్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుమారు రూ.70 లక్షల వ్యయంతో కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్ తాడిమర్రి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
www.arunaprabha.com
శనివారం, సెప్టెంబరు 26, 2026

# పట్టణ కాలుష్యానికి మొక్కల పెంపకమే పరిష్కారం

## ఎన్ఎస్ఎస్ డే వారోత్సవాల్లో పర్యావరణ పరిరక్షణకు పిలుపు

## పద్మశ్రీ వనజీవి రామయ్య స్మృత్యర్థం రావి చెట్టు సంరక్షణ



అత్తాపూర్, సెప్టెంబర్ 25:పట్టణీకరణతో పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని అత్తాపూర్ యోగా సెంటర్ గురువు, లక్ష్మీనగర్ పార్క్ అధ్యక్షుడు పి. లక్ష్మీ మహేందర్ పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అత్తాపూర్ లక్ష్మీనగర్ పార్కులో అత్తాపూర్ యోగా సెంటర్, లక్ష్మీనగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్, తెలంగాణ ఎకనామిక్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ డే వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తిశేషులు పద్మశ్రీ వనజీవి రామయ్య జ్ఞాపకార్థం గతంలో పార్కులో నాటిన రావి చెట్టును సంరక్షించే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన మాజీ ఎన్ఎస్ఎస్ అధికారి, తెలంగాణ ఎకనామిక్స్ ఫోరం అధ్యక్షుడు, ప్రముఖ పత్రికా రచయిత నేదునూరి కనకయ్య మాట్లాడుతూ మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా 1969 సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ ఆవిర్భవించిందన్నారు. ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యంపై అవగాహన, ఎయిడ్స్ నివారణ, వరదలు, మాదకద్రవ్యాల నిర్మూలన, ప్రాణాంతక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని కొనియాడారు. లక్ష్మీనగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ కన్వీనర్ నరసింహారావు మాట్లాడుతూ "దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అన్న గురజాడ అప్పారావు మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజ సేవలో ముందుకు సాగుతున్నారని అన్నారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటపతిరాజు, కుమార్‌రెడ్డి, బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అందిస్తున్న స్వచ్ఛంద సేవలతో సమాజానికి కోట్లాది రూపాయల విలువైన సామాజిక ఆస్తులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. మాజీ సైనికుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ యువతను వ్యసనాలకు దూరం చేసి, సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛంద సైనికులుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. 'నా కోసం కాదు.. నీ కోసం'లిలి అనే నినాదంతో ఎన్ఎస్ఎస్ సమాజ సేవలో ముందుకు సాగుతోందని వక్తలు పేర్కొన్నారు. సమాజ వికాసం, జాతీయ ఐక్యత, ప్రజల శ్రేయస్సు కోసం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేస్తున్న సేవలను ప్రశంసించారు. స్వచ్ఛంద సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సమాజ మార్పుకు కృషి చేయాలని బ్రహ్మనాయుడు, కలికిమూర్తి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అత్తాపూర్ యోగా సెంటర్ సభ్యులు, లక్ష్మీనగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు బ్రహ్మయ్యనాయుడు, కలికిమూర్తి, పంచాక్షరరావు, లక్ష్మీచంద్రారెడ్డి, బుచ్చయ్య, కుమార్‌రెడ్డి, వి.రాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని పలు మండలాల్లో విస్తృత పర్యటన చేసిన కలెక్టర్



అరుణప్రభ 25 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : శుక్రవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం, గూడూరు మండలం మట్టేవాడ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు, ఈ సందర్భంగా కలెక్టర్ చిన్న ముప్పారంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ సవరణ, హియరింగ్స్, రీ సర్వే గురించి తహసిల్దార్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా మ్యాపింగ్, మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదు కార్యక్రమాలను ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం జిల్లాలో షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుందని, ఓటరూ జాబితాలో పేర్లు మ్యాపింగ్ కోసం ఇప్పటికే నోటీసులు అందుకున్న వారికి హియరింగ్ నిర్వహించడం జరుగుతుందని అందులో ఎన్నికల కమిషన్ 11 రకాల గుర్తింపు కార్డులను చూపించి మ్యాపింగ్ చేసుకోవాలని తెలిపారు, ఇంకా స్పందించని ఓటరు లను చైతన్యపరిచి మ్యాపింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు, జిల్లాలో 70 గ్రామాలు రీ సర్వేకు ఎంపికైన సర్వే కొనసాగుతుందని, ప్రభుత్వ భూములు, ఆబాది, పట్టా భూములను సర్వే జరుగుతుందని ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పక్కాగా సర్వేను కొనసాగించాలని సూచించారు అనంతరం గూడూరు మండలం, మట్టేవాడ గ్రామంలో ఉన్నా గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు) ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న విద్యా బోధనలు, డైట్ మెనూ, యూనిఫార్మ్, టెస్ట్ బుక్కు, తదితర వివరాలను పిల్లలను అడిగి తెలుసుకుని స్వయంగా పరిశీలించి పిల్లలకు యూనిఫామ్ లు అందజేశారు, పిల్లలతో మాట్లాడుతూ వారి యొక్క విద్య సామర్థ్యాలను పరిశీలించారు, పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పక్కాగా డైట్ మెనూ పాటించాలని, క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు పిల్లలకు, భోజనం సిద్ధం చేసే సిబ్బందికి నిర్వహించాలని, సిబ్బంది, ఉపాధ్యాయులు, పిల్లల హాజరు వివరాలను వంద శాతం నమోదు అయ్యేవిధంగా చూడాలని, టెస్ట్ బుక్కులు, యూనిఫార్ములు అందించాలని, ఇంగ్లీష్ భాష తోపాటు ఇతర సబ్జెక్టులపై క్లుప్తంగా అర్థమయ్యే విధంగా పిల్లలకు డిజిటల్ తరగతులను నిర్వహించాలని, పిల్లలకు అందించే ఆహారం, వసతి, సౌకర్యాలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ పర్యటనలో కలెక్టర్ వెంట గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీ రామ్ నాయక్, ఇనుగుర్తి, గూడూరు తహసిల్దార్లు శ్రీనివాస్, నాగ భవాని, సంబంధిత అధికారులు ఉన్నారు

# సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ. ఈ నెల 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్డు వద్ద ఉన్న మైదానంలో బహిరంగ సభలో పాల్గొననున్నారని తెలిపారు. సీఎం పర్యటనకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సభా ప్రాంగణం, పార్కింగ్, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసు అధికారులు ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, భద్రతా చర్యలను పక్కా ప్రణాళికతో చేపట్టాలని సూచించారు. సీఎం పర్యటన విజయవంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీవో శ్రీధర్ బాబు, వేములవాడ ఆర్డీవో కె.ఎస్.బి. కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖితతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ దేవతల పూజారులైన బైండ్లకు పెన్షన్లు ఇవ్వాలి

## బైండ్ల సంక్షేమ సంఘం డిమాండ్..

## అధ్యక్షుడిగా గొట్టే రామస్వామి ఏకగ్రీవ ఎన్నిక



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 25: గ్రామ దేవతల పూజారులుగా, తరతరాలుగా కులవృత్తిని కొనసాగిస్తున్న బైండ్ల కులవృత్తిదారులకు ప్రభుత్వం ప్రత్యేకంగా పెన్షన్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల బైండ్ల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న బైండ్ల కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల పరిధిలోని వివిధ గ్రామపంచాయతీలకు చెందిన బైండ్ల కులవృత్తిదారులు శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రేణుకామాత నూతన ఆలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల బైండ్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వెంకటాపూర్‌కు చెందిన గొట్టే రామస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రాజన్నపేటకు చెందిన సుధమల్ల సుదర్శన్, కార్యదర్శిగా బండలింగంపల్లికి చెందిన బత్తుల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా సముద్రలింగాపూర్‌కు చెందిన సుధమల్ల జలంధర్, కోశాధికారిగా వెంకటాపూర్‌కు చెందిన గొట్టే సురేందర్, రైటర్‌గా వెంకటాపూర్‌కు చెందిన గొట్టే నాగార్జున, ముఖ్య సలహాదారుగా వెంకటాపూర్‌కు చెందిన సుధమల్ల విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గొట్టే రామస్వామి, ప్రధాన కార్యదర్శి సుధమల్ల జలంధర్ మాట్లాడుతూ బైండ్ల కులవృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గ్రామ దేవతల పూజలు, ఇతర సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తూ తమ కులవృత్తిని కొనసాగిస్తున్న బైండ్లకు నెలవారీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే బైండ్ల సంక్షేమ సంఘం భవన నిర్మాణం కోసం రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. బైండ్ల కులవృత్తిదారులకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, కులవృత్తికి అవసరమైన పనిముట్లను ప్రభుత్వం ఉచితంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. బైండ్ల కులవృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేయాలని నూతన కార్యవర్గం కోరింది. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఆధ్వర్యంలో బైండ్ల కులవృత్తిదారుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా కృషి చేస్తామని వారు తెలిపారు.



# 37 మందికి రూ.21.96 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ.21,96,570 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి స్వయంగా అందజేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి చికిత్స వివరాలను తెలుసుకున్నారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ సాయం ఆర్థిక ఊరటనిస్తుందని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన వారికి సీఎంఆర్ఎఫ్ ప్రయోజనం అందేలా అధికారులతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సత్యకుమార్ అన్నారు.



## రాజన్న ఆలయ విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్

### పనులు వేగవంతంగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేములవాడ పట్టణంలో వీటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులతో పాటు నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను ఆర్అండ్‌బీ, ఆలయ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన సిబ్బందిని నియమించి, పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తయ్యేలా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కలెక్టర్ వెంట శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే.ఎస్.బీ. కుమారి, ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లా నాయక్, ఆలయ ఈఈ రాజేష్, ఆర్అండ్‌బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.



## యెర్నిమాంబ ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలి

విశాఖపట్నం అరుణ ప్రభ , సెప్టెంబర్ 25: జ్ఞానాపురంలోని యెర్నిమాంబ అమ్మవారి ఆలయ అభివృద్ధికి నూతన ధర్మకర్తల మండలి సమష్టిగా కృషి చేయాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతన ధర్మకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా గణేష్‌తో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశిష్టతను కాపాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. అమ్మవారి ఆలయానికి ధర్మకర్తలుగా బాధ్యతలు స్వీకరించడం గొప్ప అదృష్టమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు దేవాలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. యెర్నిమాంబ అమ్మవారి ఆశీస్సులతో దక్షిణ నియోజకవర్గ ప్రజలకు శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, జనసేన శ్రేణులు, కార్యకర్తలు, భక్తులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఈవో సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.




## రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

### మంజూరుపై కాంగ్రెస్ నాయకుల హర్షం.. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు.

### గురుకుల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ.

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కావడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థను జిల్లాకు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూడిది రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసి ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా సూడిది రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఈ పాఠశాల మంజూరు కావడం జిల్లాకు గర్వకారణమన్నారు. నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు మెరుగైన వసతులు, క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. సిరిసిల్ల జిల్లాకు రూ.200 కోట్లతో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థను మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సిరిసిల్ల జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ కల సాకారం కానుందని, ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా వసతులు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సురేందర్, జిల్లా మాజీ మైనార్టీ అధ్యక్షుడు సాహెబ్, ఏఎంసీ డైరెక్టర్లు గుల్లపల్లి లక్ష్మారెడ్డి, మేడిపల్లి రవీందర్, సర్పంచులు సిర్రం నాగరాజు యాదవ్, మేడిపల్లి దేవానందం, ఉప సర్పంచ్ జెట్టి కిషన్, నాయకులు వంగ గిరిధర్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, పోతూరి భూపాల్‌రెడ్డి, పందిర్ల లింగంగౌడ్, బండారి బాల్‌రెడ్డి, పందిర్ల శ్రీనివాస్, తేజ శ్రీనివాస్, ఎడ్ల రాజ్‌కుమార్, గుర్రాల మహేష్‌యాదవ్, డాక్టర్ బాలయ్య, బాలకిషన్‌గౌడ్, రాజిరెడ్డి, మూర్తి వెంకటేష్, లక్ష్మారెడ్డి, ఎల్లా గౌడ్, సత్యనారాయణ, కోనేటి శ్రీనివాస్, గుర్రాల రాజిరెడ్డి, కృష్ణారెడ్డి, గండికోట రవి, వంగ శ్రీకాంత్‌రెడ్డి, దొంతి రాజేందర్‌రెడ్డి, రఫిక్, అందె సతీష్, స్వామి, చెట్కూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట ఏకలవ్య విద్యార్థుల క్రీడా ప్రతిభ

### క్లస్టర్ స్థాయి పోటీల్లో
### పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: ఉట్నూర్‌లో సెప్టెంబర్ 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన ఈఎంఆర్ఎస్ (ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్) క్లస్టర్ స్థాయి క్రీడా పోటీల్లో ఎల్లారెడ్డిపేట ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. యోగా, అథ్లెటిక్స్, ఖోఖో, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడా విభాగాల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి సత్తా చాటారు. యోగా విభాగంలో వర్షిత, నీరజ, జి. దివాకర్, బి. నివిశేఖ్, భరుప్రియలు పలు విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించారు. అథ్లెటిక్స్‌లో బి. శిరీష రెండు విభాగాల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, ఈ. చంద్రశేఖర్ ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. టేబుల్ టెన్నిస్ సీనియర్ సింగిల్స్ విభాగంలో ఎం. తరుణ్ కుమార్ ప్రథమ స్థానాన్ని సాధించారు. అదేవిధంగా అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్, ఖోఖో, బాస్కెట్‌బాల్ విభాగాల్లో పలువురు విద్యార్థులు ద్వితీయ స్థానాలు సాధించారు. తృతీయ స్థానాల్లో ఈ. చంద్రశేఖర్, కె. అనిల్, ఎల్. నందేశ్వర్ ప్రతిభ కనబరిచారు. క్లస్టర్ స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, పీఈటీలు, కోచ్‌లు హర్షం వ్యక్తం చేశారు. విజేత విద్యార్థులను అభినందించి, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పేద ప్రజల వరం

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసినమండల అధ్యక్షుడు
### లక్ష్మీనారాయణ కాంపల్లి గ్రామ సర్పంచ్ రేపల్లె ఎల్లమ్మ వెంకటవీరయ్య



సీరోల్ / అరుణ ప్రభ : మహబూబాబాద్ జిల్లా సీరియల్ మండల కేంద్రంలో ని కాంపల్లె గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ చెక్కులను డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశానుసారంగా పంపిణీ చేయడం జరిగింది పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారంమండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ ఎల్లమ్మ వెంకటవీరయ్యనాయకులు, ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కాంపల్లి గ్రామానికి చెందిన కొండ భద్రమ్మ 47000 గండ మల్ల అలవేలు 60000 జోగి శ్రీ హన్ 30000 నీరిటి రాములమ్మ 18500 గోల్కొండ వీరన్న 28000 అక్కి బుచ్చమ్మ 28000 భోగ లక్ష్మి 40000 ఈ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో పేదవాడు వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి భారీగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సీరోల్ మండలంలో అత్యధికంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు వచ్చాయని పేర్కొన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత కూడా మంజూరైందని, అర్హులైన వారందరికీ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీఎంఆర్ చెక్కులు పేద ప్రజల వరం అనికొనియాడారు ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలకు అది ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ కాంపల్లి గ్రామ సర్పంచ్ రేపాల ఎల్లమ్మ వెంకట వీరయ్య ఉప సర్పంచ్ పులసాని మహేందర్ రెడ్డి గ్రామ అధ్యక్షుడు మల్లు వెంకటేశ్వర్లు మాజీ సర్పంచ్ గంద్రాతి సత్యం మాజీ ఉపసర్పంచ్ తలకొప్పుల చంద్రయ్య జక్కోజి రమేష్ వార్డు నెంబర్ రేపాల నరేష్ వార్డ్ నెంబర్ జోగి నరేష్ గణపారపు లింగయ్య బదుగుల మోహన్ పిప్పాల మల్లయ్య వంగ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రత విషయంలో
# గురుకుల పాఠశాల యాజమాన్యం సంబంధిత అధికారుల నిర్లక్ష్యం

### ఎస్ఎఫ్ఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురుకుల గేటు ముందు ధర్నా
### ఎస్ ఎఫ్ ఐ జనగామ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్
### సి పి ఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న



అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్రం ఎస్ఎఫ్ఐ మరియు సిపిఎం ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ , కళాశాలలో ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గేటు ముందు ధర్నా చేయడం జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్ మరియు సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న మాట్లాడుతూ విద్యార్థుల భద్రత విషయంలో గురుకుల పాలకుర్తి పాఠశాల యాజమాన్యం మరియు సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల జీవితాల అయోమయంలో ఉన్నాయని అన్నారు విద్యార్థులకు కనీస భద్రత కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటుగా భావించడం జరుగుతుందని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం ముందుకు తీసుకెళుతున్నానని గొప్పలు చెబుతూ పెద్దపెద్ద వాగ్దానాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పాలకుర్తి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఆనుకొని ఉన్న గురుకుల లోనే ఇలాంటి దుస్థితి ఉంటే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగాన్ని ఎలా ఉందో గమనించాల్సిన అవసరం ఉందని అన్నారు ఈ ఒక ఘటన పైన సంబంధిత జిల్లా కలెక్టర్ గురుకులాల సెక్రటరీ స్పందించి నిర్లక్ష్యం వహించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనియెడల ఎస్ఎఫ్ఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గం లో పెద్ద ఎత్తున ఆందోళనను చేస్తామని హెచ్చరించారు విద్యార్థులకు తగు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలం చెందుతున్న యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పాలకుర్తి మండల తాసిల్దార్ కి విద్యార్థుల పక్షాన పలు డిమాండ్లతో కూడిన మెమొరండం ఇవ్వడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎదునూరి మదర్ ముసుకు ఇంద్రారెడ్డి ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా గర్ల్స్ కన్వీనర్ కడారి మానస మండల అధ్యక్ష కార్యదర్శులు మండల నాయకులు ప్రశాంత్ శ్రీకాంత్ అరవింద్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# డిండిలో ముగిసిన ఎస్ జి ఎఫ్ డివిజన్ స్థాయి క్రీడలు

అరుణ ప్రభ, డిండి, సెప్టెంబర్ 25 ,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగా దేవరకొండ డివిజన్ స్థాయి క్రీడలు దిండి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్లో గత రెండు రోజుల నుండి నిర్వహించి, శుక్రవారం తో ముగిశాయి.ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక తహసీల్దార్ హనుమంతు శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు.క్రీడల పట్ల క్రమశిక్షణతో, క్రీడలను అలవాటు చేసుకుని ముమ్మందు ఉత్తమ క్రీడాకారులుగా రూపుదిద్దుకోవాలని క్రీడాకారులకు సూచించారు.ఆయన తండ్రి గారైన స్వర్గీయ హనుమంతు చంద్రన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజేతలకు విలువైన కప్స్, మెడల్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నరసింహ, పాఠశాల హెచ్ఎం గీతాంజలి, ఎస్సై బాలకృష్ణ, మోడల్ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, స్థానిక సర్పంచ్ నల్లగంతుల రవి, ఉపసర్పంచ్ కౌసర్ రషీద్, వి శేఖర్ రెడ్డి, తిరుపతయ్య ,రామారావు, క్రీడలకున్వీనర్ జయమ్మ, కో కన్వీనర్ చంద్రయ్య, వివిధ పాఠశాలల, మండలాల ఫిజికల్ డైరెక్టర్లు తస్లీమ్, యాదయ్య, శ్రీను ,బాబు నాయక్, ఇద్దయ్య, ఎల్లయ్య ,నవనీత, నాగలక్ష్మి ,విజయలక్ష్మి, జ్యోతి, ఎల్లయ్య ,వెంకట్, సంధ్య తో పాటు ఫిజికల్ డైరెక్టర్లు ,వివిధ పాఠశాల చెందిన ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు .ఈ క్రీడల్లో విజేతలుగా బాలుర విభాగంలో కబడ్డీ విన్నర్స్ చింతపల్లి ,రన్నర్స్ గుండ్లపల్లి కోకో విన్నెర్స్ దేవరకొండ, రన్నర్స్ మల్లేపల్లి ,వాలీబాల్ విన్నర్స్ దేవరకొండ,



రన్నర్స్ చింతపల్లి, బాలికల విభాగంలో కబడ్డీ విన్నర్స్ నేరేడు గుమ్ము ,రన్నర్స్ దేవరకొండ, కోకో విన్నర్స్ కొండమల్లేపల్లి, రన్నర్స్ నేరేడు కొమ్ము ,వాలీబాల్ విన్నర్స్ మల్లేపల్లి, రన్నర్స్ చింతపల్లి ,వివిధ క్రీడలలో తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి జట్లకు ఎంపిక చేయడం జరిగింది.



# ఆధ్యాత్మిక శోభతో అంగరంగ
# వైభవంగా వినాయక నిమజ్జనం

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో తేది 25.9.2026 బుధవారం నాడు 8వ వార్డు హనుమాన్ నగర్ కాలనీ శ్రీ శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు అనంతరం యువకులు భక్తులు కాలనీవాసులు ప్రజాప్రతినిధులు మేళ తాళాల నడుమ ఊరేగింపుగా నిమజ్జన ప్రాంతానికి తరలి వెళ్లారు యువత మరియు మహిళ భక్తులు గణపతి బప్ప మోరియా అంటూ నినాదాలు చేస్తూ ఎంతో ఉత్సాహంగా వైభవంగా నిమజ్జన కార్యక్రమం లో పాల్గొన్నారు



## పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా భాజపా నాయకుల ఘన నివాళులు

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండలం అంత్యోదయ ఆలోచనకు ఆద్యుడు, ఏకాత్మ మానవతావాద దార్శనికుడు పూజ్య పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు పాకనాటి దామోదర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దీన్ దయ ఉపాధ్యాయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపన చేయడమే కాకుండా పార్టీని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తూ పార్టీయే జీవితంగా భావించి పార్టీ కొరకు తన జీవితాన్ని ,తన ప్రాణాన్ని సైతం అర్పించిన ప్రజా నాయకుడు అని వారి బాటలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా సీనియర్ నాయకులు దొంగరి మహేందర్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు లకావత్ రవి నాయక్ ,మండల ప్రధాన కార్యదర్శులు వేల్పుల దేవరాజు ,పెనుగొండ సోమేశ్వర్ మండల ఉపాధ్యక్షులు పబ్బా సంతోష్,మండల నాయకులు కరుణాకర్,ముస్కు ఉపల్లయ్య, ముస్కు చంద్రబాబుమరియు ఇతర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.



## ధర్మవరం పాలిటెక్నిక్‌కు
## 4 ఏసీలు.. విద్యార్థినులకు 35 సైకిళ్లు
## సంస్కృతి సేవా సమితి సహకారంతో అందజేత

ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నాలుగు ఏసీలు, 35 మంది విద్యార్థినులకు సైకిళ్లు అందజేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ చొరవతో సంస్కృతి సేవా సమితి సహకారంతో శుక్రవారం వీటిని అందించారు. ఇటీవల కళాశాలను సందర్శించిన మంత్రి దృష్టికి అధ్యాపకులు, సిబ్బంది కళాశాల అవసరాలను తీసుకెళ్లారు. కంప్యూటర్ ల్యాబ్‌లో ఏసీలు, విద్యార్థినులకు సైకిళ్లు అవసరమని కోరారు. స్పందించిన మంత్రి సంబంధిత సంస్థ సహకారంతో సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. నాలుగు ఏసీలను కంప్యూటర్ ల్యాబ్‌లో ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు సాంకేతిక విద్య అభ్యసనకు మెరుగైన వాతావరణం కలగనుంది. సైకిళ్ల పంపిణీతో విద్యార్థినుల రాకపోకలకు సౌకర్యం కలగనుంది.

## కన్నయ్య మృతితో ఆర్యవైశ్య సంఘాల్లో విషాదం



ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్, ఆర్యవైశ్య యువజన సంఘం వ్యవస్థాపకులు, శ్రీ వాసవి అన్నపూర్ణేశ్వరి సేవా సమితి వ్యవస్థాపకులు తబ్జుల్ కన్నయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంస్థల్లో పలు బాధ్యతలు నిర్వహించిన ఆయన సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొన్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సుమారు 55 కిలోల వెండితో అమ్మవారికి వెండి వాకిలిని ఇటీవల ఏర్పాటు చేయించారు. పలు దేవాలయాలు, ఆర్యవైశ్య సంఘాలకు ఆర్థిక సహాయం అందించారు. కన్నయ్య మృతి పట్ల ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంస్థల ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.



## మద్యం తాగి వాహనాలు నడిపిన
## నలుగురికి రూ.40 వేల జరిమానా

ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ధర్మవరం రెండో పట్టణ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేశారు. గురువారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరు ఆటో డ్రైవర్లు, ఇద్దరు కారు డ్రైవర్లు పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసి శుక్రవారం ధర్మవరం రెండో తరగతి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.40 వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు నిబంధనలు పాటించాలని రెండో పట్టణ సీఐ జయా నాయక్ సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వినాయక లడ్డూ వేలంలో రూ.లక్ష.. వరుసగా 8వసారి సోను భాయ్‌దే!

**గజేంద్ర యూత్ అసోసియేషన్ లడ్డూ వేలం..**
**రూ.1 లక్షకు దక్కించుకున్న రాకేష్ గైక్వాడ్**

**గణనాథునిపై భక్తి.. లడ్డూ వేలంలో సోను భాయ్ మరోసారి విజయం**

**ఎనిమిదేళ్లుగా వినాయక లడ్డూపై సోను భాయ్ ప్రత్యేక అభిమానం**



సెప్టెంబర్ 25, అరుణ ప్రభ : గజేంద్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన లడ్డూ వేలంపాట భక్తిశ్రద్ధల మధ్య ఉత్సాహంగా సాగింది. ఈ వేలంపాటలో టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, హరిబోలి డివిజన్ నాయకులు సోను భాయ్ రాకేష్ గైక్వాడ్ రూ.1 లక్షకు వినాయకుడి లడ్డూను దక్కించుకున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సోను భాయ్ లడ్డూ వేలంలో పాల్గొని దక్కించుకున్నారు. గత 8 సంవత్సరాలుగా వరుసగా వినాయకుడి లడ్డూను వేలంపాటలో దక్కించుకుంటూ వస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా సోను భాయ్ రాకేష్ గైక్వాడ్ మాట్లాడుతూ.. గణపతి అనుగ్రహంతో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా లడ్డూను వేలంపాటలో దక్కించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గణనాథుని ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మంధన్ గైక్వాడ్, అనిల్ గౌడ్, సురేష్, పవన్, క్రాంతి, సాయి, చింటూ, అభిషేక్, అఖిల్ గౌడ్, వినయ్ గౌడ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ‘నేను మంత్రి అవుతా’.. నందిని

**మంత్రి సత్యకుమార్‌తో బాలికల ముఖాముఖి**



ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడారు. “ఏదైనా అడగండి.. స్వేచ్ఛగా మాట్లాడండి” అని మంత్రి చెప్పడంతో బాలికలు పాఠశాల వసతులు, చేనేత, ధర్మవరం అభివృద్ధిపై ప్రశ్నలు సంధించారు. “భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారు?” అని మంత్రి అడగ్గా ఏడో తరగతి విద్యార్థిని నందిని “నేను మంత్రి అవుతా” అని సమాధానమిచ్చింది. ఆమెను అభినందించిన మంత్రి.. లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడాలని సూచించారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని వెంకటరమణమ్మ “ధర్మవరానికి మెడికల్ కాలేజీ తెస్తామన్నారు.. అది ఏమైంది?” అని నేరుగా ప్రశ్నించింది. ధర్మవరానికి ఆయుర్వేద వైద్య కళాశాల మంజూరైందని, టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. చేనేత కుటుంబాల కోసం తీసుకున్న చర్యలపై మరో విద్యార్థిని ప్రశ్నించగా, ధర్మవరానికి మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ మంజూరైనట్లు మంత్రి తెలిపారు. పాఠశాలలో ట్యాబ్లెట్లు, అదనపు మరుగుదొడ్లు కావాలన్న విద్యార్థినుల విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించారు. పాఠశాల వెనుక చెత్త, దుర్వాసనపై మున్సిపల్ సిబ్బందితో వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలని మంత్రి సూచించారు. ధర్మవరంలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు పోటీ పరీక్షల కోసం ఉచిత శిక్షణ, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు, డీఎంహెచ్‌వో ఫైరోజ్ బేగం, డీఈవో కిష్టప్ప, ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ సుమన తదితరులు పాల్గొన్నారు.

## నూరవ ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయండి



**::: దర్గా కమిటీ పిలుపు**

ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం చెరువు కట్ట వద్ద ఉన్న హజరత్ సయ్యద్ మహమ్మద్ షా ఖాదర్ వలీ రహమతుల్లా అలై దర్గా నూరవ ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని దర్గా కమిటీ, ముజావర్ ఖాద్రీ నవాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మసీదులో ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. అక్టోబరు 27 నుంచి 30 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న గంధం, 28న ఉరుసు, 29న జియారత్, 30న సలాం, ఫాతేహా కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉత్సవాల్లో ప్రత్యేక కవ్వాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దర్గా కమిటీ గౌరవాధ్యక్షుడు సోలిగాల చిన్న వెంకటేశులు, అధ్యక్షుడు కొత్వాల్ ఖాజా హుస్సేన్, ఉపాధ్యక్షుడు ముక్తియార్, ప్రధాన కార్యదర్శి వెల్దుర్తి బాబా ఫక్రుద్దీన్, సహకార దర్శి మహమ్మద్ ఖాద్రి, కోశాధికారి తాహిర్ హుస్సేన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణపై అవగాహన

**జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో మంత్రి సత్యకుమార్**



ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ధర్మవరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. విద్యార్థినులకు నులిపురుగుల నివారణకు సంబంధించిన మాత్రలను అందజేసి, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నులిపురుగుల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, పరిశుభ్రత పాటించడం అవసరమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు, డీఎంహెచ్‌వో ఫైరోజ్ బేగం, డీఈవో కిష్టప్ప, ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమన, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దకే పెన్షన్ల పంపిణీ

**అక్టోబరు 1 నుంచి 3 వరకు పంపిణీ- ఎంపీడీవో**



ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో పెన్షన్లను అక్టోబరు 1 నుంచి 3వ తేదీ వరకు ఇంటి వద్దకే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్ తెలిపారు. అక్టోబరు 1 నుంచి 6వ తేదీ వరకు బ్యాంకులకు వరుస సెలవులు ఉండటంతో పెన్షనర్లకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే పంపిణీ చేపడుతున్నట్లు చెప్పారు. అక్టోబరు 1న మధ్యాహ్నం నుంచి పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. మండలంలోని 6,653 మంది పెన్షనర్లకు రూ.2,96,59,500 మేర పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు.

## బ్రదర్స్ యూత్ గణేశుని లడ్డు 43200 రూపాయలకు కైవసం చేసుకున్న జంగిలి బుగ్గ రాములు



అరుణప్రభ ప్రతినిధి ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామంలో బ్రదర్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశుడి లడ్డూ వేలంలో 43200 రూపాయలకు జంగిలి బుగ్గ రాములు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరాత్రులు పూజలు అందుకున్న వినాయకుడి లడ్డు కైవసం చేసుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలందరినీ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ గణేశుడు ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరి పైన ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో బ్రదర్స్ యూత్ నిర్వాహకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## విఘ్నేశ్వరుడికి ఇక వీడ్కోలు

**వినయముతో భక్తిశ్రద్ధలతో పూజించి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాం. చిన్న తుండ్ల గ్రామ ఉపసర్పంచ్ నాయిని శ్రీకాంత్.**

ఇబ్రహీంపట్నం అరుణప్రభ ప్రతినిధి సెప్టెంబర్ 25 : చిన్నతుండ్ల గ్రామం, మున్నూరు కాపు యువత ఆధ్వర్యంలోని వినాయకుడి నవరాత్రుల పర్వదినాలను ఆనందంగా పురస్కరించుకొని, చిన్న పెద్ద తారతమ్యాలు భేదాలను మరిచి, కలిసి మెలిసి భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు ఘనంగా చేసిన విఘ్నేశ్వరుడి యొక్క అత్యంత పవిత్రమైన ప్రసాదాన్ని వినాయకుని లడ్డు నాయిని నర్సింహ 30116 రూపాయలకి కైవాసం చేసుకోడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ నాయిని శ్రీకాంత్ మాట్లాడుతూ పూర్వం ఆచారాలను సంస్కృతులను కాపాడడం మన యొక్క బాధ్యత మరియు కర్తవ్యం దీనికి యువత ఎల్లవేళలా కృషి చేయాలి. గ్రామ ప్రజలంతా సోదరా భావంతో ఉంటూ గ్రామ అభివృద్ధిలో తమ వంతు కృషిని అందించాలి అన్నారు.



## జెడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): శ్రీ సత్యసాయి జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఎ. శ్యాంప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ ఎన్నికైన సభ్యుల సాధారణ పదవీకాలం సెప్టెంబరు 24తో ముగిసింది. దీంతో జెడ్పీ పాలన, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగేందుకు ప్రభుత్వం సెప్టెంబరు 19న జారీ చేసిన జీవో నంబరు 129 ప్రకారం కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, ప్రాథమిక విద్య, వైద్యం వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. జెడ్పీ నిధులను పారదర్శకంగా ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తామని, ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ, ఈబీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జెడ్పీ సీఈవో పి.విజయలక్ష్మి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, పంచాయతీరాజ్ అధికారులు, జెడ్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ శాఖ డీడీపై ఆరోపణలు

**విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి: పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు**



ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): శ్రీ సత్యసాయి జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రాజేంద్రకుమార్‌రెడ్డిపై కొందరు మహిళా ఉద్యోగులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని, వాటిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర కోరారు. శుక్రవారం ధర్మవరంలో ఆయన ప్రకటన విడుదల చేశారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్న కొందరు మహిళా ఉద్యోగులకు విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, షోకాజ్ నోటీసులు, మెమోలు జారీ చేయడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అలాగే వాట్సాప్ గ్రూపుల్లో మహిళా ఉద్యోగులను ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై మహిళా ఉద్యోగుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం పరిశీలించి, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని మంజుల నరేంద్ర కోరారు. విచారణలో ఆరోపణలు వాస్తవమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు అవసరమైన రక్షణ, న్యాయం కల్పించాలని కోరారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఈ అంశంపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.



## ‘సంజీవని’తో సమగ్ర వైద్యం

**డిసెంబరు 10 నుంచి ట్రయల్ రన్.. జనవరి 1 నుంచి పూర్తిస్థాయి అమలు**

**ధర్మవరం నుంచి 71 ఆరోగ్య రథాలు ప్రారంభం**

ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): ప్రజల ఆరోగ్య వివరాలను డిజిటల్‌గా నమోదు చేసి, పరీక్షల నుంచి చికిత్స వరకు వైద్య సేవలను అనుసంధానం చేసే ‘సంజీవని’ కార్యక్రమాన్ని డిసెంబరు 10 నుంచి ట్రయల్ రన్‌గా, జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన 71 ఆరోగ్య రథాలను శుక్రవారం ధర్మవరం నుంచి ప్రారంభించారు. ఆరోగ్య రథాల్లో 41 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించి, 48 గంటల్లో రిపోర్టులను వాట్సాప్ ద్వారా పంపుతామని తెలిపారు. ప్రతి వ్యక్తికి ప్రత్యేక ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించి, గత వైద్య చరిత్ర, పరీక్షల ఫలితాలు, మందుల వివరాలను నమోదు చేస్తామన్నారు. రాష్ట్రంలో మొత్తం 933 ఆరోగ్య రథాలను ఏర్పాటు చేస్తున్నామని, 2 వేలకుపైగా ఆసుపత్రుల్లో సమన్వయకర్తల ద్వారా అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడమే ‘సంజీవని’ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఆరోగ్య శాఖ అధికారులు, ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలను సందర్శించిన బజ్జూరి శ్రీనివాస్ గుప్తా

## విఘ్నాలు తొలగాలని విగ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు



సెప్టెంబర్ 25,అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.వినాయక చవితి 10వ రోజు ఉత్సవాలలో భాగంగా బిజెపి నాయకులు బజ్జురి శ్రీనివాస్ గుప్తా చెంగిచెర్ల డివిజన్ల పరిధిలోని శ్రీ గణపతి మండపాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా మండపాల వద్ద నిర్వహించిన భజన కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బజ్జూరి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ చివరి నవరాత్రి రోజు దర్శించుకోవడం అత్యంత భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న వినాయక మండపాలను సందర్శించడం ఆనందంగా ఉందని, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపతి మండప నిర్వహకులు పలు కాలనీలా అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# అక్టోబరు 1 మధ్యాహ్నం నుంచి పెన్షన్ల పంపిణీ

## బ్యాంకు సెలవుల నేపథ్యంలో ముందస్తు పంపిణీ



ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం పట్టణంలోని 40 వార్డుల్లో అక్టోబరు 1వ తేదీ మధ్యాహ్నం నుంచి పెన్షన్ల పంపిణీ ప్రారంభమవుతుందని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. బ్యాంకులకు వరుసగా ఐదు రోజులు సెలవులు ఉండటంతో ముందస్తుగా పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని 17,609 మంది పెన్షనర్లకు రూ.7,73,57,000 పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పెన్షన్ పంపిణీ సిబ్బందికి సహకరించాలని, ఎవరూ లంచం ఇవ్వవద్దని స్పష్టం చేశారు.

# మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల గర్వకారణం

## గొల్లపల్లి సంజనకు ఘన సత్కారం



అరుణప్రభ 25 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా జెడ్ పి ప్రభుత్వ పాఠశాలల తరఫున ఎస్ ఎస్ సి 2025--2026లో జిల్లా టాపర్‌గా నిలిచిన జెడ్ పి హెచ్ ఎస్ గర్ల్స్ , మహబూబాబాద్ విద్యార్థిని గొల్లపల్లి సంజనకు హృదయపూర్వక అభినందనలు. ఈ సందర్భంగా శ్రీరామ్ చిట్స్ సంస్థ అందించిన 2,00,000 నగదు ప్రోత్సాహకాన్ని తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా ఈ రోజు అందుకోవడం ఎంతో ఆనందకరమైన విషయం. విద్యార్థిని సంజన సాధించిన ఈ విజయానికి ఆమె తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం. సంజన విజయం ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలకు, విద్యార్థుల ప్రతిభకు నిదర్శనం! ఈ సందర్భంగా విద్యార్థులు అభినందించిన వారిలో పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉపాధ్యాయులు శ్రీవాణి,జి . విజయ కుమారి ఈ , సునీత,G. మంజుల రాణి,జి . సునీత,జి .సంజీవ, వీణ, , సుచిత్ర,రజియా ,శ్వేత, రంజాన్ అలీ, రమేష్,గీత, సుధారాణి పద్మలత, లక్ష్మయ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు

# పీర్జాదిగూడ లేక్ వ్యూ కాలనీలో ఘనంగా మట్టి గణపతి నిమజ్జన వేడుకలు

## ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్

## 46,000/- రూ. గణపతి లడ్డును సొంతం చేసుకున్న జయరాం కుటుంబ సభ్యులు





సెప్టెంబర్ 25, అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ లేక్ వ్యూ కాలనీలో అధ్యక్షులు బేవర జయరాం ఆధ్వర్యంలో మట్టి గణపతిని ప్రతిష్టించి 11 రోజులు విశేష పూజలు అందించారు. కాల్ నివాసులు ఐక్యంగా ఆనందోత్సాహాల మధ్య నిర్వహించిన వినాయక నిమజ్జనం వేడుకల్లో ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తొమ్మిది రోజులు విశేష పూజలు అందుకున్న మహాగణపతి లడ్డూ వేలం పాట హుషారుగా పోటాపోటీగా సాగింది. ఈ వేలం పాటలో 46,000/-,వేల రూపాయలకు జయరాం కుటుంబ సభ్యులు మహాగణపతి లడ్డను సొంతం చేసుకున్నారు. అదేవిధంగా స్వామి వారి మణిహారాన్ని 6000 /-రూపాయలకు యోగి కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కుర్ర శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి గణపతిని ప్రతిష్టించి లేక్ వ్యూ కాలనీ వాసులు ఆదర్శంగా నిలిచారని కాలనీవాసులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ జనరల్ సెక్రటరీ దేవేందర్, కోశాధికారి హుస్సేన్ భాష, సభ్యులు రామకృష్ణ, యోగి, గోపి, శరత్ చంద్ర ,బాలు, కాలనీ యాసోసియేషన్ సభ్యులు మహిళలు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వెస్ట్ బాలాజీ హిల్స్ కాలనీలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

## సుమారు 3000 మంది భక్తులకు మహా అన్న ప్రసాద వితరణ

## ముఖ్య అతిథిగా పాల్గొన్న తోటకూర అజయ్ యాదవ్, పి హరినాథ్ రెడ్డి



సెప్టెంబర్ 25, అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని వెస్ట్ బాలాజీ హిల్స్ కాలనీలో కాలనీ అధ్యక్షుడు, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షులు చింతల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా 12వ రోజు ముఖ్యఅతిథిగా బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి హరినాథ్ రెడ్డి, లోకేష్ తదితరులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులపై అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా చింతల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాలనీవాసుల సహకారంతో ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, గణపతి హోమం, కుంకుమార్చన, వంటి ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని సుమారు 3000 మంది భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చింతల విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి, ఎం ప్రభాకర్ రెడ్డి, కాళీ కృష్ణ, నర్సింహులు, సాయిప్రసాద్, రోహిత్ రెడ్డి, అఖిల్, బాలకృష్ణ, బొట్టు చంద్రశేఖర్, వెంకటేష్, భగవత్, రేఖ, జోష్ణ, సంగీత, హేమలత, కృష్ణకుమారి, అసోసియేషన్ సభ్యులు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రైవర్లకు ఉద్యోగ అవకాశాలు

## పరిమిత ఖాళీలు.. ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యం



ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా డైలీ వేజెస్ ప్రాతిపదికన పనిచేసేందుకు ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనాలు నడిపిన అనుభవం ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ధర్మవరం ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఖాళీలు పరిమితంగా ఉన్నందున ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

# పెండింగ్ డిమాండ్లు పరిష్కరించాలి

## వారానికి 5 రోజుల పని విధానం అమలు చేయాలి: బ్యాంకు ఉద్యోగుల యూనియన్లు

ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రాంతీయ కార్యదర్శి విష్ణువర్ధన్, ట్రేడ్ యూనియన్ కార్యదర్శి రాజశేఖర్, పట్టణ యూఎఫ్‌బీయూ కన్వీనర్ గోపాల్‌నాయక్ ఒక ప్రకటనలో పలు డిమాండ్లను వెల్లడించారు.

**ప్రధాన డిమాండ్లు:**

- బ్యాంకుల్లో వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలి.
- అన్ని శనివారాలను సెలవు దినాలుగా ప్రకటించాలి.
- 2024 మార్చి 8న కుదిరిన వేతన ఒప్పందంలో పరిష్కారం కాని అంశాలను పరిష్కరించాలి.
- 2015లో కుదిరిన ఒప్పందంలోని అంశాలను అమలు చేయాలి.
- ఉద్యోగ సంఘాల నాయకులతో ద్వైపాక్షిక చర్చలు జరిపి పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపాలి.
- ఉద్యోగుల విషయంలో సమతుల్యమైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా ధర్మవరం పట్టణంలోని బ్యాంకు ఉద్యోగులు సెప్టెంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 26న నాలుగో శనివారం కావడంతో బ్యాంకులకు సెలవు ఉంటుందని, సెప్టెంబరు 27న ఆదివారం బ్యాంకులు పనిచేస్తాయని పేర్కొన్నారు. సెప్టెంబరు 28, 29, 30 తేదీల్లో సమ్మె కారణంగా బ్యాంకు శాఖలు మూసివేసి సేవలు నిలిచిపోతాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబరు 26 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని నాయకులు హెచ్చరించారు.



# ఎస్ టి యు ,టి ఎస్ ఉపాధ్యాయ సంఘం గోడపత్రిక ఆవిష్కరణ

అరుణ ప్రభ, డిండి ,సెప్టెంబర్ 25,ఎస్ టి యు ఉపాధ్యాయ సంఘం 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం హైదరాబాదులోని శుభం కన్వెన్షన్ నాగోల్ లో వైభోత్సవం నిర్వహించబడుతుందని, దిండి మండల ఎస్ టి యు అధ్యక్షురాలు కే ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు శుక్రవారం దిండి మండల కేంద్రంలో గోడ పత్రికలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్టీయూ సంఘం అధ్యక్షులు సదానందం గౌడ్, కార్యదర్శి జే గజేందర్ హాజరైతారని, కావున ఉపాధ్యాయ మిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

# ఎల్.సి.కె.పురంలో రూ.కోటితో బీసీ భవనం

## ::: మూడు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం



ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం ఎల్.సి.కె.పురంలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న బీసీ సామాజిక భవనానికి మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ లాడ్స్ నిధుల నుంచి ఎంపీలు బి.సత్యనారాయణ, ఆర్.కృష్ణయ్య చెరో రూ.50 లక్షలు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. సుమారు రెండు సెంట్ల స్థలంలో నిర్మించే భవనాన్ని మూడు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. బీసీ కుటుంబాల శుభకార్యాలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణకు ఈ భవనం ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. భవిష్యత్‌లో విస్తరించి 300--400 మంది పాల్గొనే కార్యక్రమాలకు అనువుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి, అధికారులు, బీసీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఈవీఎం గోదాము వద్ద పటిష్ట నిఘా

## త్రైమాసిక తనిఖీలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): ఈవీఎం గోదాము వద్ద 24 గంటలూ పటిష్ట భద్రత, నిరంతర నిఘా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా శుక్రవారం ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. గోదాము వద్ద భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, రక్షణ ఏర్పాట్లను కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాము భద్రత, నిర్వహణకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన వివరాలను వారికి వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి, తహసీల్దార్ దేవరాజు, రెవెన్యూ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# అంత్యోదయ స్ఫూర్తితో అభ్యున్నతికి కృషి చేయాలి

## పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ ఆశయాలు నేటికీ మార్గదర్శకం :మంత్రి సత్యకుమార్

ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): సమాజంలోని చివరి వ్యక్తికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయడమే అంత్యోదయ స్ఫూర్తి అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ 110వ జయంతి సందర్భంగా శుక్రవారం ధర్మవరం కాలేజ్ సర్కిల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దీనదయాళ్ ఉపాధ్యాయ్ దేశసేవకు జీవితాన్ని అంకితం చేశారని, భారతీయ జనసంఘ్ బలోపేతానికి కీలకంగా పనిచేశారని మంత్రి తెలిపారు. ఆయన ప్రతిపాదించిన అంత్యోదయ, ఏకాత్మ మానవవాద సిద్ధాంతాలు నేటికీ ప్రాధాన్యత కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి వర్గానికి అభివృద్ధి, సంక్షేమ అవకాశాలు అందేలా పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళి అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనలో కీలక నియామకాలు

### పార్టీ సంస్థాగత బలోపేతానికి : కొట్టాల యాదగిరి చర్యలు

### న్యాయ రక్షణ విభాగం అధ్యక్షుడిగా పి. నరేష్ చారి,



గజ్వేల్ అరుణ ప్రభ : గజ్వేల్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ సంస్థాగత బలోపేతం దిశగా కీలక నియామకాలు చేపట్టారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొట్టాల యాదగిరి ఆధ్వర్యంలో న్యాయ రక్షణ విభాగం అధ్యక్షుడిగా పి. నరేష్ చారి, మీడియా విభాగం అధ్యక్షుడిగా ఏ. ప్రవీణ్, గజ్వేల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లింగని రాజు నియమితులయ్యారు. వారికి కొట్టాల యాదగిరి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యులకు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, కార్యకర్తల సమన్వయం, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంపై కొట్టాల యాదగిరి సూచనలు చేశారు. నూతన బాధ్యులు తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొట్టాల యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, పట్టణ యువజన అధ్యక్షుడు కూరాకుల శ్రీకాంత్, 7వ వార్డు అధ్యక్షుడు కుమార్, నరేందర్ రెడ్డి, స్వామి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### నూతన పింఛన్దారులకు పింఛన్ పంపిణీ చేసిన చైర్పర్సన్



అరుణప్రభ 25 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో చైర్ పర్సన్ స్వస్థలమైనటువంటి 4వ వార్డు గాంధీపురంలో నూతన పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ పాల్గొని నూతన పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో మహిళలకు పెద్దపీట వేసిందన్నారు అదే విధంగా వడ్డీ లేని రుణాలు డ్వాక్రా మహిళలకు అదే విధంగా ఉచిత బస్సు, 500 ఫ్రీ గ్యాస్, ఉచిత కుట్టుమిషన్లు, మహిళా సబ్సిడీలు, మహిళలను ఆర్టీసీలో భాగస్వాములను చేసి అదే విధంగా క్యాంటీన్లను నిర్వహించి కోటి మంది మహిళలను కోటీశ్వరాలను చేయాలన్న రేవంత్ రెడ్డి ఆశయాన్ని ప్రతి మహిళలు గుర్తు పెట్టుకోవాలని వారి వెన్నంటే నడవాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందించడం ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మురళి నాయక్ ప్రజా మహిళ సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే మురళి నాయక్ కి, చైర్మన్ జ్యోతి రమేష్ నాయక్ కి కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో అధికారులు వార్డు ఆఫీసర్ శశి కుమార్, రామస్వామి,కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య కోసం నిరంతర పోరాటం

### ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి..
### ప్రైవేట్ ఫీజులకు నియంత్రణ చట్టం తేవాలి
### విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరి మురళి



గజ్వేల్ అరుణ ప్రభ : తెలంగాణలో నాణ్యమైన విద్య కోసం సమిష్టిగా నిరంతరం పోరాటం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ మాజీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, విద్యా రంగానికి బడ్జెట్‌లో 18 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యా బస్సు యాత్ర శుక్రవారం గజ్వేల్ చేరుకోవడంతో టీపీటీఎఫ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ "తెలంగాణ విద్యా వ్యవస్థ ప్రస్తుతం ఐసీయూలో ఉంది" అని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం ప్రజా ఉద్యమం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎంవీ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం ఆందోళనకర పరిణామమన్నారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు, నిర్వహణ, నాణ్యమైన విద్యను మెరుగుపరచాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చట్టబద్ధమైన కమిషన్ ఏర్పాటు చేయాలన్న విద్యా కమిషన్ సిఫారసులను అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీఎఫ్, టీపీటీఎఫ్, సీపీఐ, డీబీఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# వైభావంగా అనంతాద్రి ఆలయంలో అనంతపద్మనాభస్వామి వ్రతం





అరుణప్రభ 25 సెప్టెంబర్ మహబూబాబాద్ మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని మహబూబాబాద్ అనంతాద్రి స్వయంభు శ్రీ జగన్నాథ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అనంతపద్మనాభ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ గొడవర్తి చక్రధరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, వ్రత కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# త్యాగాలకు గుర్తింపు ఎక్కడ?
# హామీల అమలుకు ఉద్యమకారుల పోరుబాట




### 9వ రోజుకు చేరిన రిలే దీక్షలు.. హామీలు నెరవేర్చే వరకు పోరాటం

అల్వాల్ సర్కిల్ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో, ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 9వ రోజుకు చేరుకున్నాయి. ఈరోజు దీక్షలో కె. యాదగిరి రావు, సల్మాన్ రాజ్ కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షులు డా. ముష్కం రామకృష్ణ గౌడ్ పాల్గొని దీక్షను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాటోళ్ల సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, ఏ.డి. దయాకర్, డోలి సుధీర్, అనంతుల సంతోష్, ముత్యాలు, శేరుపల్లి మల్లేష్, నగేష్, సత్తయ్య తదితరులు పాల్గొని ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా డా. ముష్కం రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనేక మంది తెలంగాణ ఉద్యమకారులు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు, నష్టాలను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వారిని ఆదుకుని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఉద్యమకారుల త్యాగాలకు గౌరవం ఇవ్వాలి -- ఇచ్చిన హామీలను అమలు చేయాలి.



## మానుకోట ఆర్టీసీ డిపోలో మొదలైన ఎన్నికల సందడి

అరుణప్రభ 25 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో అక్టోబర్ 9 తేదీన జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల సమర శంఖారావం శుక్రవారం మహబూబాబాద్ డిపోలో ప్రారంభించడం జరిగింది. ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని మైబాద్ డిపోలోని కార్మికులందరి సమక్షంలో ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి తెలంగాణ వర్కర్స్ యూనియన్ మరియు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఐక్య కూటమి ఆధ్వర్యంలో కన్వీనర్లు కొలిపాక మల్లయ్య, ఆళ్వార్ గార్ల ఆధ్వర్యంలో డిపోలో గేటు మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఇట్టి గెట్ మీటింగ్ కు మైబాద్ డిపో నాయకులు సాయన్న, షబ్బీర్, రమేష్, అనిల్, సుధాకర్ ,ఖలీల్ సుదర్శన్, అశోక్ కుమార్, మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్టాభి లక్ష్మయ్యలు పాల్గొని ప్రసంగిస్తూ గత పది సంవత్సరాలుగా ఆర్టీసీలో ఎన్నికలు లేకుండా యూనియన్లను ప్రక్కన పెట్టి కార్మిక హక్కులను కాలరాచడం చాలా అన్యాయం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 2017, 2021 జీతభత్యాలను సవరిస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే కొరకై ముందుగా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల షెడ్యూల్ను కూడా విడుదల చేసి అక్టోబర్ 9వ తేదీన ఎన్నికలు నిర్వహించడం ఆహ్వానిస్తూ ఈరోజు ఆర్టీసీలోని కార్మిక సమస్యల కార్మిక హక్కుల పై అవగాహన కలిగిన నాయకులు అశ్వద్ధామ రెడ్డి మరియు వివిఎస్ రావు ని వారి నాయకత్వంలో ఉద్యోగ భద్రత, చక్కటి విలీన ప్రక్రియ, మాస్టర్ పే స్కేల్స్, సర్వీస్ కండిషన్లు, ఇంకా పని గంటల విధానం అన్నిటిని మార్చాలంటే కేవలం అశ్వద్ధామ రెడ్డి వి ఎస్ రావు గార్ల నాయకత్వాల్లోనీ తెలంగాణ వర్కర్స్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కూటమికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మహ,బాద్ డిపోలో 100కు 99 శాతం ఈ కూటమికి సంబంధించిన ఓట్లు ఉన్నందున ఒక్క కార్మికుని ఓటు కూడా క్రాస్ కాకుండా మన ఓట్లు మనకు పడే విధంగా మన హక్కులను మనం రక్షించుకునే విధంగా ముందుకెళ్లాలని గతంలోనూ కార్మిక హక్కులు కాపాడింది ఈ నాయకులే అని తెలియజేయడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో గ్యారేజీ,ట్రాఫిక్ నాయకులు పాషా, లింగస్వామి, హరికుమార్, చిర్రా వెంకటేశ్వర్లు, శ్రీనివాసు, కృష్ణ, శంకర్, నభి రమాదేవి, సుమ, జ్యోతి, వెంకన్న, వేలాద్రి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 27న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు
## ::: జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు



విశాలాంధ్ర, ధర్మవరం: జెవివి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ఈ నెల 27వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కాకతీయ విద్యానికేతన్‌లో నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా జెవివి నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ఈ ఏడాది జిల్లా స్థాయి సంబరాలను ఎన్ఎస్ గేట్ రోడ్‌లోని కాకతీయ విద్యానికేతన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 30 మండలాల నుంచి 180 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని పేర్కొన్నారు. అంతేకాకుండా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరవుతారని తెలిపారు. కావున ఈ సంబరాలను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



## మద్యం దుకాణాలకు టెండర్ బాక్స్ ఏర్పాటు
## ఆరు దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెన్యూవల్ కాని ఆరు మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించేందుకు ఎక్సైజ్ స్టేషన్‌లో టెండర్ బాక్స్ ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ అధికారి చంద్రమణి తెలిపారు. జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధర్మవరం మున్సిపాలిటీ-5, ధర్మవరం రూరల్-12, బత్తలపల్లి-13, తాడిమర్రి-16, ముదిగుబ్బ-17, 18 గజిట్ నంబర్లకు సంబంధించిన ఆరు దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. అక్టోబరు 1వ తేదీ అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్‌లో నేరుగా లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అక్టోబరు 5న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించి దుకాణాలను కేటాయిస్తామని చంద్రమణి వెల్లడించారు.



## ఘనంగా లోక్ కళ్యాణ్ మేళా
## వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి రుణాలపై అవగాహన

ధర్మవరం, సెప్టెంబరు 25; (అరుణ ప్రభ న్యూస్): వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ధర్మవరం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌లో పీఎం స్వనిధి లోక్ కళ్యాణ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం ద్వారా లభించే రుణాలు, వాటి ప్రయోజనాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. అర్హులైన లబ్ధిదారులకు పీఎం స్వనిధి రుణ మంజూరు పత్రాలను అందజేశారు. వీధి వ్యాపారులు పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ మద్దిలేటి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనాథ్‌రెడ్డి, మెప్మా టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పెనుబోలు విజయ్‌భాస్కర్, ఇన్‌చార్జి సీఎంఎం బి.లక్ష్మీనారాయణ, సీఓలు, మెప్మా ఆర్పీలు, సంఘ సభ్యులు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

# గుండెపోటు ముప్పుతో గుండెల్లో గుబులు!

**వరుస మరణాలతో ఎల్లారెడ్డిపేట మండలంలో కలవరం.**

**యువకులు, మహిళలు, వృద్ధులనూ వదలని ఆకస్మిక మృత్యువు.**

**కుటుంబ పెద్దలను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో బాధిత కుటుంబాలు.**







ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి: ఎప్పుడు ఎవరి ప్రాణాలను గుండెపోటు కబళిస్తుందో తెలియని పరిస్థితి... నిన్నటి వరకు మన మధ్య నవ్వుతూ, తిరుగుతూ కనిపించిన వారు ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు... వరుసగా చోటుచేసుకుంటున్న గుండెపోటు మరణాలతో ఎల్లారెడ్డిపేట మండల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇటీవల కాలంలో మండలంలోని పలు గ్రామాల్లో గుండెపోటుతో ఆకస్మిక మరణాల సంఖ్య పెరుగుతున్నట్లు కనిపిస్తుండటంతో ప్రజలు కలవరపడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా యువకులు, మహిళలు, వృద్ధులు సైతం గుండెపోటుకు గురై అకాల మరణం చెందుతుండటం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది. తాజాగా రాచర్ల గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బొల్లి లింగం గుండెపోటుతో మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. ప్రజా జీవితంలో చురుగ్గా ఉన్న ఆయన ఆకస్మిక మృతి గ్రామస్తులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇదే తరహాలో కొద్ది నెలల వ్యవధిలో బొప్పాపూర్‌కు చెందిన నిమ్మల సత్యం, కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి, మూడిళ్ల చంద్రారెడ్డి, ఎల్లారెడ్డిపేటకు చెందిన సందుపట్ల రాజిరెడ్డి తదితరులు గుండెపోటుతో మృతి చెందడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మండలంలోని ఇతర గ్రామాల్లోనూ యువకులు, మహిళలు, వృద్ధులు గుండెపోటుతో అకాల మరణం చెందుతున్న ఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

**కుటుంబ పెద్దలే దూరమైతే..!**

కుటుంబానికి ఆధారంగా నిలిచే వ్యక్తులు అకస్మాత్తుగా మృతి చెందుతుండటంతో వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాలు మానసిక వేదనతో పాటు ఆర్థిక సమస్యలను కూడా ఎదుర్కొంటున్నాయి. పిల్లల చదువులు, కుటుంబ పోషణ, అప్పులు, ఇతర బాధ్యతలు ఒక్కసారిగా కుటుంబ సభ్యులపై పడటంతో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టబడుతున్నాయి.

**గుండెపోటుపై అప్రమత్తత అవసరం.**

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం, ఒత్తిడి వంటి అంశాలతో పాటు అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ తదితర సమస్యలు గుండె సంబంధిత ప్రమాదాలను పెంచే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రతి ఆకస్మిక మరణానికి ఒకే కారణం ఉంటుందని చెప్పలేమని, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను వైద్యుల ద్వారా పరీక్షించుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గుండె సంబంధిత లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య సహాయం పొందడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనలను పాటించడం అత్యంత ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు.

**"ఎవరికి.. ఎప్పుడు..?" అనే భయం**

మండలంలోని పలు గ్రామాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ఆకస్మిక గుండెపోటు మరణాలతో ప్రజల్లో "ఎవరికి.. ఎప్పుడు..?" అనే భయం నెలకొంది. తమకు తెలిసిన వారు, సన్నిహితులు, గ్రామస్తులు అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గ్రామాల్లో గుండె ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆరోగ్య పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలని, అత్యవసర సమయంలో సకాలంలో వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆల్ ఇండియా లెవెల్ పీజీ మెడికల్ విభాగంలో మెరిసిన ఈగ జ్యోతిర్మయి

**డాక్టర్ జ్యోతిర్మాయికి ఘనంగా సత్కరించిన ఆర్యవైశ్య సంఘం.**

**శుభాకాంక్షలు తెలియజేసే ఘన సత్కారం చేసిన ఆర్యవైశ్య సంఘం**



అరుణప్రభ మహబూబాబాద్ సెప్టెంబర్ 25 : మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఈగ శ్రీను రమ్య దంపతుల ప్రధమ కూతురు ఆల్ ఇండియా మెడికల్ పిజి ఎంట్రన్స్ లో జాతీయస్థాయిలో 7346 ర్యాంక్ సాధించడం ఆర్యవైశ్యులకు గర్వించదగ్గ శుభదినముగా పరిగణిస్తూ ఈ ర్యాంకు సాధించడం ఆర్యవైశ్యులు గుర్తించి ఆర్యవైశ్యులందరూ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా దుశ్యాలువ మెమొంటో తో ఘనంగా సత్కరించినారు ఈ సందర్భంగా సత్కరించిన ఆర్యవైశ్యులు మాట్లాడుతూ ఓపెన్ కేటగిరీలో ఆర్యవైశ్య ముద్దుబిడ్డ ఇంతటి గణ కీర్తి సాధించడం జిల్లాకే గర్వకారణమని కోర్సు పూర్తయిన అనంతరం నాణ్యమైన వైద్య సేవలు తక్కువ ధరకే అందరికీ అందుబాటులో ఉండే విధంగా వైద్యం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఈ ర్యాంకు సాధించడం తన తల్లిదండ్రుల మరియు అధ్యాపకుల కృషితో సాధించానని వారి కలలను సాకారం చేసినందుకు ఆనందంగా ఉందని మహబూబాబాద్ ఆర్యవైశ్య సంఘం వారు నా కృషిని గుర్తించి సన్మానం చేసిన ఆర్యవైశ్యులందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు గిరిధర్ గుప్తా 19వ వార్డు కౌన్సిలర్ చిదిరాల అరుణ జ్ఞానేశ్వర్ గుప్తా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి నాళ్ళ నరసింహారావు జిల్లా కార్యదర్శి వేమిశెట్టి కిషోర్ ఇమ్మడి కృష్ణమూర్తి నాళ్ల వీరన్న వేణుగోపాల్ శ్రీరంగం ఉపేందర్ మాలె శ్రావణ్ ఇమ్మడి రవి జంగాల సదాశివుడు మాశెట్టి రవికుమార్ లక్ష్మీ కాంతారావు ఈగ రమేష్ కోదుమూరు వీరభద్రం కొత్త సోమన్న గోపు రాము సోమ శ్రీనివాస్ గెల్లి మురళి ఇందిరా నాళ్ళ మహేశ్వరి నాళ్ల శోభ జంగాల జ్యోతి శ్రీరాం రాధిక తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.14 లక్షలకు గణేశుడి లడ్డూ వేలం

**రూ.38,116లకు కలశం.. ఘనంగా గణేశ నిమజ్జన శోభాయాత్ర**



గుర్రంగూడ, సెప్టెంబర్ 25: మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని గుర్రంగూడ బృందావన్‌నగర్ కాలనీలో శ్రీ గణేశ్ ఉత్సవ సమితి, బృందావన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణేశుడి లడ్డూ వేలంలో మోర్ల శ్రీనివాస కిరణ్‌కుమార్--నాగమణి దంపతులు రూ.1,14,116కు లడ్డూను దక్కించుకున్నారు. కలశం వేలంలో పండ్ల బ్రహ్మం--వైష్ణవి దంపతులు రూ.38,116కు కలశాన్ని సొంతం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శోభాయాత్రలో కాలనీ అధ్యక్షుడు గడ్డం లింగారెడ్డి, కార్యదర్శి విష్ణువర్ధన్‌రావుతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా ప్రజలంతా గణేశ్ ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, ప్రత్యేకంగా గుర్రంగూడ బృందావన్ నగర్ కాలనీ ప్రజలు అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వచ్చే ఏడాది మరింత ఘనంగా గణేశ్ ఉత్సవాలను నిర్వహించి గుర్రంగూడలోని ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచేలా ప్రతి సంవత్సరం ఉత్సవాలను కొనసాగిస్తామని తెలిపారు. శోభాయాత్రలో చిన్నారులు, మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా ముందుకు సాగారు. గణేశుడి నామస్మరణల మధ్య సాగిన శోభాయాత్రతో బృందావన్ నగర్ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది.

# బలంరాయిలో ముప్పిడి గోపాల్ ఘాటు వ్యాఖ్యలు

**కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను**

**ఖండించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్**

**బలంరాయిలో ముప్పిడి గోపాల్ ఘాటు వ్యాఖ్యలు**



బలంరాయిలో నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులంతా భక్తిభావంతో, భక్తిగీతాలు, భజన కార్యక్రమాలతో ఉత్సవాలను ఆనందంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సూచించారని తెలిపారు. అయితే కమిషనర్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పరుష పదజాలంతో మాట్లాడడం సరికాదని ముప్పిడి గోపాల్ తీవ్రంగా ఆక్షేపించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి అవాకులు, చవాకులు మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. కమిషనర్ వ్యాఖ్యల్లో తప్పేముంది భక్తులు ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలని చెప్పడమేనా నేరమా అంటూ ప్రశ్నించారు. పోలీసు అధికారులపై అనవసర వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇదే విధంగా బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తూ ముందుకు సాగితే నగర ప్రజలే తగిన సమాధానం చెబుతారని, ఇలాంటి వ్యాఖ్యలతో ప్రజల్లో గందరగోళం సృష్టించవద్దని ఘాటుగా హెచ్చరించారు. గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టుగా.. ఉందని ముప్పిడి గోపాల్ ఎద్దేవా చేశారు. వినాయక నిమజ్జన వేడుకలను రాజకీయాలకు వేదికగా మార్చకుండా భక్తి, భజన, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.





**మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి గారికి మర్యాదపూర్వకంగా కలిసిన శాసనసభ్యులు డా పట్లోళ్ల సంజీవరెడ్డి వారి సోదరుడు డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి**

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి గారులి నియమితులైన సందర్భంగా గౌరవ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు గడ్డం వినోద్ వెంకటస్వామి గారి వారి స్వగృహాలలో హైదరాబాదులో శాలువా కప్పి బొకే ఇస్తూ డిసిసి ఎన్నికకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపిన శాసన సభ్యులు డాక్టర్ పట్టోళ్ల సంజీవరెడ్డి గారు డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి గారు . ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పట్లోళ్ల చంద్ర శేఖర్ రెడ్డికి మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు మరియు గడ్డం వినోద్ కుమార్ గార్లు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఈ సందర్భంగా తెలియజేశారు .

## రాజన్న సిరిసిల్లలో కాంగ్రెస్ సన్నాహక సమావేశం

**30న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో 26న సమావేశం**



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి, సెప్టెంబర్ 25: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పర్యటించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ జంక్షన్ సమీపంలోని సాయి మణికంఠ గార్డెన్స్‌లో సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు హాజరుకానున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ తెలిపారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, పార్టీ శ్రేణుల సమన్వయం, కార్యక్రమంలో కార్యకర్తల భాగస్వామ్యం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. సన్నాహక సమావేశానికి రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పీసీసీ కార్యవర్గ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ, పట్టణ శాఖల అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని సంగీతం శ్రీనివాస్ కోరారు.



## సిరిసిల్ల సభను విజయవంతం చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

,ఎల్లారెడ్డి పేట (అరుణప్రభ): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభ, ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం వేములవాడ పట్టణంలో వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమై సీఎం పర్యటన ఏర్పాట్లు, జన సమీకరణపై దిశానిర్దేశం చేశారు. గ్రామాల వారీగా జన సమీకరణ బాధ్యతలు తీసుకున్న నాయకులు తాము ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలను సభకు తరలించాలని సూచించారు. నిర్దేశించిన సంఖ్యకు అదనంగా మరో పది మంది వచ్చేలా జన సమీకరణ చేపట్టాలని నాయకులకు ఆది శ్రీనివాస్ సూచించారు. జన సమీకరణపై మండల, జిల్లా కమిటీలతో పాటు రాష్ట్ర కమిటీ కూడా సమీక్షించే అవకాశం ఉందని తెలిపారు. సిరిసిల్లలో జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి భారీ సభ, ర్యాలీని విజయవంతం చేయడంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పెద్ద సంఖ్యలో ప్రజలను సభకు తరలించాలని పిలుపునిచ్చారు. సభ విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## రోడ్డుపైకి వచ్చిన పాడి గేదెలు..

**బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు.**



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ఎల్లారెడ్డిపేట--కోరుట్లపేట గ్రామాల మధ్య కోళ్ల ఫారం సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపక్కన కట్టివేసిన పాడి గేదెలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో అటుగా బైక్‌పై వెళ్తున్న వ్యక్తి వాటిని తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన పండుగ రమేష్ (40) గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. రోడ్లపై పశువులను కట్టివేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

# వార్త రాశాం.. ప్రశ్నించాం.. అయినా చర్య ఎక్కడ?

## శేరిలింగంపల్లిలో అక్రమ నిర్మాణాలపై అధికారుల మౌనం..

## ప్లాట్ నంబర్ 186 లో కొనసాగుతున్న నిర్మాణ పనులపై స్పష్టత ఏది?

## సర్కిల్-49 టౌన్‌ప్లానింగ్‌పై ఫిర్యాదులు.. టీపీఓ అక్బర్ వివరణ కోసం ఎదురుచూపులు



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 25,(అరుణప్రభ)**




శేరిలింగంపల్లి పరిధిలో అక్రమ నిర్మాణాలు, అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై వరుసగా కథనాలు వెలువడుతున్నా.. సంబంధిత అధికారులు మాత్రం ఇప్పటికీ స్పష్టమైన చర్యల వివరాలను వెల్లడించకపోవడం చర్చనీయాంశంగా మారింది. సర్కిల్--49,పరిధిలో నిర్మాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతూ సెప్టెంబర్ 20న ప్రచురించిన కథనం అనంతరం కూడా క్షేత్రస్థాయిలో పరిస్థితిలో మార్పు కనిపించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రత్యేకంగా సర్కిల్--49 శ్రీరామ్‌నగర్‌లోని ప్లాట్ నంబర్ 186 నిర్మాణంపై అనుమతి గడువు ముగిసిందని ఫిర్యాదులు, కథనాలు వచ్చినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతునే ఉన్నాయి. ఈ విషయంపై అధికారులు ఇప్పటివరకు తనిఖీ చేశారా? అనుమతి స్థితి ఏమిటి? నిర్మాణానికి ప్రస్తుతం చట్టబద్ధమైన అనుమతి ఉందా? నోటీసు ఇచ్చారా? తదుపరి చర్య ఏమిటి? అన్న వివరాలను బహిరంగంగా వెల్లడించాల్సి ఉంది.

### కథనం తర్వాత కూడా అదే పరిస్థితి?

పత్రికలో కథనం ప్రచురితమైన తర్వాత సాధారణంగా సంబంధిత అధికారులు స్థలాన్ని పరిశీలించి, అనుమతులు--ఆమోదిత ప్లాన్--ప్రస్తుత నిర్మాణ పరిస్థితిని సరిపోల్చి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంటుంది. కానీ ప్లాట్ నంబర్ 186 విషయంలో అలాంటి తనిఖీ జరిగిందా? జరిగితే ఎప్పుడు జరిగింది? ఏం గుర్తించారు? సంబంధిత వ్యక్తులకు నోటీసు ఇచ్చారా? నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశించారా? అనే విషయాలపై అధికారిక సమాచారం వెలువడలేదు. కథనం వచ్చినా.. ఫిర్యాదు ఉన్నా.. నిర్మాణం కొనసాగుతోందన్న ఆరోపణలు వస్తున్నా.. అధికారులు స్పందించకపోవడానికి కారణమేంటి? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

### ‘మీరు ఎన్ని కథనాలు రాసినా...” అన్న భావనకు తావెందుకు?

సంబంధిత అధికారులపై కొందరు ఫిర్యాదుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సర్కిల్--49 టౌన్‌ప్లానింగ్ విభాగం పరిధిలోని కొన్ని నిర్మాణాల విషయంలో ఫిర్యాదులు, పత్రికా కథనాలు వచ్చినప్పటికీ చర్యలు కనిపించడం లేదని వారు ఆరోపిస్తున్నారు.అయితే అధికారులు ఉద్దేశపూర్వకంగా పట్టించుకోవడం లేదని తేల్చి చెప్పడం కంటే.. ఫిర్యాదులపై అధికారికంగా ఏ చర్యలు జరిగాయి? అనే రికార్డును పరిశీలించడం కీలకం.తనిఖీ తేదీ..నోటీసు తేదీ..చర్య తేదీ..

తదుపరి తనిఖీ తేదీ..ఈ వివరాలు బయటకు వస్తే అసలు పరిస్థితి స్పష్టమవుతుంది.

టీపీఓ అక్బర్ వివరణ ఇవ్వాల్సిన అంశాలివే..

సర్కిల్--49 టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన టీపీఓ అక్బర్ పరిధిలోని నిర్మాణాలపై స్థానికుల నుంచి ప్రశ్నలు వస్తున్న నేపథ్యంలో ఆయన అధికారిక వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేకంగా ప్లాట్ నంబర్ 186పై

- అనుమతి గడువు ముగిసిన తర్వాత కూడా దర్జగా నిర్మాణం కొనసాగుతోంది అంటే దానికి ప్రస్తుత నిర్మాణానికి చెల్లుబాటు అయ్యే అనుమతి ఏదైనా ఉందా?
- ఆమోదిత ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతోందా?
- ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు జరిగాయి?
- ఏవైనా నోటీసులు జారీ చేశారా?
- నిర్మాణం నిలిపివేతకు ఏమైనా ఆదేశాలు ఇచ్చారా?
- ప్రస్తుతం అధికారికంగా ఫైల్ ఏ దశలో ఉంది? అనే అంశాలపై స్పష్టత ఇస్తే స్థానికుల్లో ఉన్న అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.

### అధికారుల మౌనం.. అనుమానాలకు కారణమా?

ఒక నిర్మాణంపై ఆరోపణ రావడం మాత్రమే దానిని అక్రమ నిర్మాణంగా నిర్ధారించదు. అదే సమయంలో ఫిర్యాదు వచ్చిన తర్వాత అధికారులు స్పందించకుండా ఉండటం కూడా సమస్యను పరిష్కరించదు. అందుకే అనుమతి పత్రాలు, ఆమోదిత ప్లాన్, క్షేత్రస్థాయి తనిఖీ నివేదిక, నోటీసులు, తదుపరి చర్యలు ఆధారంగా వాస్తవ పరిస్థితిని వెల్లడించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. జీహెచ్‌ఎంసీ అధికారిక మార్గదర్శకాల్లో అనుమతి లేకుండా లేదా ఆమోదిత ప్రణాళికకు విరుద్ధంగా జరిగే నిర్మాణాలపై చర్యలకు నిబంధనలు ఉన్నాయి. అధికారిక సిటిజెన్ చార్టర్ లో అనధికార నిర్మాణాలపై చర్యకు 30 రోజుల సమయపరిమితి కూడా పేర్కొనబడింది.









### మొదటి కథనం తర్వాత.. రెండో ప్రశ్న

### ‘కథనం వెలువడిన తర్వాత అధికారులు ఏం చేశారు?”

ఇది కేవలం ఒక నిర్మాణానికి సంబంధించిన ప్రశ్న కాదు.ఫిర్యాదు వచ్చినప్పుడు అధికారుల స్పందన ఎలా ఉంది?తనిఖీ తర్వాత ఫాలోఅప్ ఎలా జరుగుతోంది?నోటీసు ఇచ్చిన తర్వాత నిర్మాణాన్ని ఎవరు పర్యవేక్షిస్తున్నారు?గడువు ముగిసిన అనుమతులపై చర్యలు ఎలా ఉంటాయి? అన్నది తెలుసుకోవాల్సిన అంశం.

### నిర్మాణం పూర్తయ్యే వరకు చూస్తారా?

నిర్మాణం ప్రారంభ దశలోనే నిబంధనల ఉల్లంఘన గుర్తిస్తే చర్యలు తీసుకోవడం సులభం. నిర్మాణం పూర్తయిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే ముందుగానే పర్యవేక్షణ చేయడం అవసరం. అందుకే సర్కిల్-49లో ఫిర్యాదులు వచ్చిన నిర్మాణాలపై ప్రత్యేక క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించి, ఒక్కో నిర్మాణానికి సంబంధించిన అనుమతి, గడువు, ఆమోదిత ప్లాన్, ప్రస్తుత నిర్మాణ పరిస్థితి, నోటీసులు, తదుపరి చర్యలను సమీక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ప్లాట్ నంబర్ 186తో పాటు కథనంలో ప్రస్తావించిన ఇతర నిర్మాణాలపై అధికారులు వాస్తవ పరిస్థితిని వెల్లడిస్తే.. ఆరోపణలకు, అనుమానాలకు తావు ఉండదు. నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా ఉంటే అదే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలి. ఉల్లంఘన ఉంటే నిబంధనల ప్రకారం తీసుకున్న చర్యలను వెల్లడించాలి. చర్య పెండింగ్‌లో ఉంటే కారణం, తదుపరి చర్యను తెలియజేయాలి.

అంతే తప్ప.. వార్తలు వస్తున్నా మౌనం కొనసాగడం వల్ల ప్రజల్లో అనుమానాలు మరింత పెరిగే అవకాశం ఉంది.అయితే చివరి ప్రశ్నగా

పత్రిక కథనం తర్వాత అధికారులు ఫైల్‌ను కదిలించారా?లేక ఫైల్ కదలకుండానే నిర్మాణం మాత్రం ముందుకు వెళ్తుందా?

### ప్లాట్ నంబర్ 186పై అధికారిక రికార్డులు ఏం చెబుతున్నాయి?

### టౌన్‌ప్లానింగ్ విభాగం ఎప్పుడు స్పందిస్తుంది?

సర్కిల్-49లో క్షేత్రస్థాయి పర్యవేక్షణకు బాధ్యులైన అధికారులు ప్రజలకు ఎప్పుడు స్పష్టత ఇస్తారు? ఇక సమాధానం మాటల్లో కాదు.. క్షేత్రస్థాయిలో కనిపించే చర్యల్లో ఉండాలి.అంటున్న స్థానికులు

---

# సురక్షితమైన మరియు గౌరవప్రదమైన బాల్యాన్ని కల్పించడం మనందరి బాధ్యత

## సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి

అరుణప్రభ 25 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ బాలబాలికలపై జరుగుతున్న లైంగిక ఆకృత్యాలను అరికట్టడానికి, వారికి సురక్షితమైన మరియు గౌరవప్రదమైన బాల్యాన్ని అందించడానికి పోక్సో చట్టం అత్యంత కఠినమైన నిబంధనలతో అమలవుతోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి స్పష్టం చేశారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ ) నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. లింగభేదాలకు తావులేకుండా 18 సంవత్సరాల లోపు వయసున్న బాలబాలికలందరికీ ఈ చట్టం పూర్తి చట్టబద్ధమైన రక్షణ కల్పిస్తుందన్నారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా విద్యార్థినులు భయపడకుండా, సిగ్గుపడకుండా వెంటనే తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా ఇంట్లోని పెద్దలకు తెలియజేయాలని ఆమె స్పష్టం చేశారు. వేధింపుల గురించి ఫిర్యాదు చేసిన బాధితుల వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టరని, వారి గుర్తింపును చట్టప్రకారం పూర్తిగా గోప్యంగా ఉంచుతారని విద్యార్థులకు ధైర్యం కల్పించారు. బాలలపై ఎక్కడైనా లైంగిక వేధింపులు జరిగినట్లు గమనిస్తే... ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది లేదా స్థానికులు తక్షణమే పోలీసులకు లేదా ‘చైల్డ్‌లైన్’ కు ఫిర్యాదు చేయడం చట్టరీత్యా తప్పనిసరని, నేరాన్ని దాచిపెట్టడం లేదా




ఉపేక్షించడం కూడా శిక్షార్హమైన నేరమన్నారు. బాధితుల గుర్తింపును వెల్లడించేలా వారి పేర్లు, ఫొటోలు, పాఠశాల లేదా నివాస వివరాలను సోషల్ మీడియా లేదా ఇతర ప్రసార మాధ్యమాలలో బహిర్గతం చేయడం తీవ్ర నేరమన్నారు. బాధితులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత లీగల్ ఎయిడ్ న్యాయవాదుల సేవలు అందించబడతాయని, అలాగే బాధితుల పరిహార పథకం కింద తగిన ఆర్థిక, వైద్య, మానసిక సహాయం లభిస్తుందని తెలియచేశారు. విద్యార్థులకు న్యాయస్థానాల పనితీరుపై ప్రత్యక్ష అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో, ఆసక్తి గల విద్యార్థులను ఒకరోజు కోర్టు ప్రాంగణానికి తీసుకురావాలని న్యాయమూర్తి పాఠశాల ప్రత్యేకాధికారికి సూచించారు. అనంతరం అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ వి.రాజ్ కృష్ణ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు సామాజిక దురాచారాలని, ఆర్థిక లేదా ఇతర ఇబ్బందుల వల్ల బాల్యాన్ని దూరం చేసుకోవద్దని హితవు పలికారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటివల్ల జరిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలు నిర్వహించిన వారు, ప్రోత్సహించిన వారు కూడా నేరస్తులుగా పరిగణించబడతారన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను వివరిస్తూ, న్యాయ సలహాల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సంప్రదించవచ్చని సూచించారు. అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ.. సాంకేతికతను సరైన రీతిలో వినియోగించుకోవాలని, సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల బాలికలు సైబర్ నేరగాళ్ల వలలో పడి అఘాయిత్యాలకు గురవుతున్నారని, తద్వారా తమ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని హెచ్చరించారు. బాలికల భవిష్యత్తు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం జిల్లాలో ఇటీవల చేపట్టిన ‘హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్’ ను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఈ సందర్భంగా తెలియచేశారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థినులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి సునీత, బోధనా సిబ్బంది, గూడూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య బృందం, మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

CORPORATE OFFICE: SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267, HUDA SAI NAGAR COLONY,
BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070. TG. CELL. 9348313999/8885727777.

EDITED, PRINTED, PUBLISHED & OWNED BY GURRAM PAPI REDDY, # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501511. TELANGANA. PRINTED AT: GARUDA PRINT-ERS, # H.NO.2-86/1, PLOT NO.23-SP, SYNO.417, SAGAR HIGHWAY, RANGANNAGUDA VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501510. TELANGANA. PUBLISHED AT: # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT. 501511. TELANGANA....WWW.ARUNAPRABHA.COM.EMAIL.ARUNAPRABHADAILY@GMAIL.COM, RNI NO. TELTEL/2023/89778, CELL NO. 9700127889.